సాక్షి
అనంతపురం

మంగళవారం । 23 । సెప్టెంబర్ । 2025



అమ్మవు నీవే అఖిల జగాలకు

దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. జిల్లా అంతటా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవారి నామస్మరణ మార్మోగుతోంది. ఉత్సవాల్లో భాగంగా అనంతపురం కొత్తూరులోని వాసవీమాత ఆలయంలో అన్నపూర్ణాదేవి, శివుడు, పార్వతి, వినాయకుడు, సుబ్రహ్మణ్య అలంకారాలు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

న్యూస్‌రీల్

ఆర్డీటీ పరిరక్షణ కమిటీకి సంపూర్ణ మద్దతు

- వైఎస్సార్‌ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత



మాట్లాడుతున్న అనంత వెంకటరామి రెడ్డి. చిత్రంలో పార్టీ నేతలు విశ్వ, రంగయ్య

అనంతపురం కార్పొరేషన్‌: ఆర్డీటీ పరిరక్షణ కమిటీకి వైఎస్సార్‌ సీపీ తరఫున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, పార్టీ ఉరవకొండ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల సమన్వయ కర్తలు విశ్వేశ్వర రెడ్డి, తలారి రంగయ్య పేర్కొన్నారు. ఉద్యమ కార్యాచరణకు పూర్తి సహకారమందిస్తామన్నారు. సోమవారం జిల్లా వైఎస్సార్‌ సీపీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 56 ఏళ్లుగా ఆర్డీటీ పేదలకు అండగా ఉంటోందన్నారు. విద్య, వైద్యంతో పాటు మహిళా సాధికారత సాకారంలో ప్రభుత్వానికి దీటుగా పని చేస్తోందన్నారు. అలాంటి సంస్థకు కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్‌లో జాప్యం జరుగుతుండడంతో సంస్థ మనుగడే ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఇప్పటికే ఆర్డీటీకి మద్దతుగా వైఎస్సార్‌ సీపీ అనేక కార్యక్రమాలు చేపట్టిందని గుర్తు చేశారు. ఆర్డీటీ మూతపడితే వేలాది మంది ఉపాధి కోల్పోతారన్నారు. విద్య, వైద్యం ఇబ్బందిగా మారే పరిస్థితి లేకపోలేదన్నారు. ఉమ్మడి జిల్లాలోని బత్తలపల్లి, కళ్యాణదుర్గం, కణేకల్లు ప్రాంతాల్లో 600 పడకలతో ఆర్డీటీ ఆస్పత్రులను ఏర్పాటు చేసి ప్రజలకు సేవలందిస్తోందన్నారు. ఆర్డీటీని కాపాడుకోవడం ప్రథమ కర్తవ్యంగా భావించి ఉద్యమానికి సంపూర్ణ మద్దతు ఇవ్వడంతో పాటు ప్రత్యక్షంగానూ పాల్గొంటామన్నారు. దసరా నేపథ్యంలో ఉద్యమ కార్యాచరణలో మార్పులు చేసుకోవాలన్నారు. ఈ నెల 29న కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి, పండుగ తర్వాత జాతీయ రహదారుల దిగ్బంధం లాంటి కార్యక్రమాలు చేపడితే బాగుంటుందని ఆర్డీటీ పరిరక్షణ కమిటీకి వారు సూచించారు.

సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు

- ప్రైవేట్‌ పాఠశాలల యాజమాన్యాలకు డీఈఓ ఆదేశం

అనంతపురం ఎడ్యుకేషన్‌: దసరా పండుగ సెలవుల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించరాదని ప్రైవేట్‌ పాఠశాలల యాజమాన్యాలను డీఈఓ ఎం.ప్రసాద్‌బాబు ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అన్ని యాజమాన్యాల పాఠశాలలకు అక్టోబరు 2 వరకు ప్రభుత్వం సెలవులు ప్రకటించిందన్నారు. ఆదేశాలు ఉల్లంఘించి ఎవరైనా విద్యార్థులకు తరగతులు పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు సెలవులను సద్వినియోగం చేసుకోవాలని డీఈఓ కోరారు.

కారుణ్యం చూపారు..



కలెక్టర్‌ ఆనంద్‌ చేతుల మీదుగా కారుణ్య నియామక పత్రం అందుకుంటున్న రంగనాథ్‌

సాక్షి ఎఫెక్ట్‌..

అనంతపురం అర్బన్‌: కారుణ్య నియామకాల ప్రక్రియకు కలెక్టర్‌ ఓ. ఆనంద్‌ శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా సోమవారం ఇద్దరికి నియామక పత్రాలను అందజేశారు. ఈ నెల 21న సాక్షిలో ''కొత్తసారుపై కొండంత ఆశ'' శీర్షికన ప్రచురితమైన కథనానికి కలెక్టర్‌ స్పందించారు. కారుణ్య నియామకాల ప్రక్రియ నెలలోగా పూర్తి చేయాలని పరిపాలనా విభాగం అధికారులను ఆదేశించిన ఆయన.. వెనువెంటనే చర్యలకు ఉపక్రమించారు. ఐసీడీఎస్‌లో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ మరణించిన వెంకటరమణ కుమారుడు రంగనాథ్‌కు పోలీసుశాఖలో జూనియర్‌ అసిస్టెంట్‌గా ఉద్యోగం కల్పిస్తూ సోమవారం ఉత్తర్వులు ఇచ్చారు. వీఆర్‌ఓ గ్రేడ్‌–2 విధులు నిర్వర్తిస్తూ మరణించిన సుధాకర్‌రెడ్డి సతీమణి సుశీలమ్మకు విభిన్న ప్రతిభావంతుల శాఖలో ఓఎస్‌డీగా ఉద్యోగం కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ బాధ్యతగా విధులు నిర్వర్తించి అందరి మన్ననలు అందుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జాయింట్‌ కలెక్టర్‌ శివ్‌ నారాయణ్‌ శర్మ, డీఆర్‌ఓ మలోల, పరిపాలనాధికారి అలెగ్జాండర్‌, తదితరులు పాల్గొన్నారు.

కేశవా.. చూడవా..

మంత్రి ఇలాకాలో.. రహదారుణాలు



జల్లిపల్లిలో బురదమయంగా మారిన రోడ్డు



ముష్టూరు వద్ద రహదారిపైనే నిలిచిన వర్షపు నీరు

రాష్ట్ర ప్రభుత్వంలో కీలక మంత్రిగా, ఉరవకొండ ఎమ్మెల్యేగా ఉన్న పయ్యావుల కేశవ్‌ సొంత నియోజకవర్గమైన ఉరవకొండలో రహదారుల పరిస్థితి అధ్వానంగా మారింది. ఉరవకొండతో పాటు నియోజకవర్గంలోని ఏ పల్లెకు వెళ్లినా గుంతలు, బురదమయంగా మారిన రోడ్లే కనిపిస్తున్నాయి. ఎన్నికల సమయంలో మాయమాటలతో ఓట్లు దండుకున్న ఆయన నేడు గ్రామాల వైపు చూసే పరిస్థితి లేదని ప్రజలు వాపోతున్నారు. గోతుల రోడ్లలో నీళ్లు నిలిచాయి. అలాగే, అస్తవ్యస్తంగా తయారైన డ్రైనేజీలు దుర్వాసన వెదజల్లుతున్నాయి. రాకపోకలకు ఇబ్బందులతో పాటు ప్రజారోగ్యం దెబ్బతినే పరిస్థితి నెలకొందని నియోజకవర్గ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



ఆమిద్యాలలో ఇలా..



రాకెట్లలో అధ్వానంగా రోడ్డు



హంసాయిపల్లి- జీడిపల్లి డ్యాం రోడ్డు దుస్థితి



ఉరవకొండలోని ఓ కాలనీలో ఇలా..

అటకెక్కిన విద్యాభివృద్ధి

'సమగ్ర' గందరగోళం

- ఏడాదికిపైగా భర్తీకాని సెక్టోరియల్‌ అధికారుల పోస్టులు
- రెండుసార్లు నోటిఫికేషన్లు ఇచ్చి ఇద్దరినే తీసుకున్న అధికారులు
- ఇంటర్వ్యూలు ముగిసి నెలన్నరవుతున్నా కొలిక్కిరాని వైనం
- పర్యవేక్షణ లేక కుంటు పడుతున్న విద్యాభివృద్ధి కార్యక్రమాలు
- కొత్త కలెక్టర్‌ అయినా దృష్టి పెట్టేనా?



అనంతపురం ఎడ్యుకేషన్‌: జిల్లా 'సమగ్ర శిక్ష' గందరగోళంగా మారింది. సెక్టోరియల్‌ అధికారులు లేక పాలన కుంటుపడింది. ఈ ప్రభావం విద్యాభివృద్ధిపై పడుతోంది. సమగ్రశిక్షలో పని చేస్తున్న సెక్టోరియల్‌ అధికారులందరినీ నిబంధనలకు విరుద్ధంగా 2024 ఆగస్టు 1న రిలీవ్‌ చేశారు. ప్రిన్సిపల్‌ కార్యదర్శి ఉత్తర్వులను బేఖాతరు చేస్తూ ఉన్నవారిని తప్పించారు. అప్పట్లో డీఈఓగా పని చేసిన వరలక్ష్మీ ఈ వ్యవహారంలో కీలకంగా వ్యవహరించారు. ఉన్నవారిని తప్పించేందుకు చూపించిన శ్రద్ధ కొత్తవారిని తీసుకోవడంలో చూపించలేకపోయారు. ఫలితంగా ఏడాదిదాటినా ఆ పోస్టులు భర్తీ కాలేదు.

చివరిస్థానానికి పడిపోయిన జిల్లా

పూర్తిస్థాయిలో సెక్టోరియల్‌ అధికారులు ఉన్న సమయంలో డీపీసీ, ఏపీసీ సమన్వయం, ఎంఈఓలు, హెచ్‌ఎంలతో తరచూ పర్యవేక్షణ కారణంగా పీఎంశ్రీ, టీచ్‌టూల్‌, ఇన్‌క్లూజివ్‌ ఎడ్యుకేషన్‌ కార్యక్రమాలు, ఎఫ్‌ఎల్‌ఎన్‌ శిక్షణ తదితర అంశాల్లో రాష్ట్రంలోనే జిల్లా మొదటిస్థానంలో ఉండేది. సెక్టోరియల్‌ అధికారులను పంపిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మొదటి స్థానం పక్కన పెడితే చివరిస్థానంలో నిలవాల్సిన దుస్థితి ఏర్పడింది. సమగ్రశిక్షలో ఇలాంటి పరిస్థితి నెలకొన్నా జిల్లాలోని మంత్రి, ఎంపీ, ఎమ్మెల్యేలు కనీస దృష్టి సారించకపోవడం బాధాకరమని ఉపాధ్యాయులు వాపోతున్నారు.

ఇంటర్వ్యూ ముగిసి నెలదాటినా...

2024 ఆగస్టు 1న సెక్టోరియల్‌ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ విడుదల చేశారు. సుమారు 8 నెలల తర్వాత 5 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసి కలెక్టర్‌ ఆమోదంతో ఎస్పీడీ కార్యాలయానికి పంపారు. అక్కడి నుంచి కమిషనర్‌, ప్రిన్సిపల్‌ కార్యదర్శికి వెళ్లింది. ప్రిన్సిపల్‌ కార్యదర్శి ఆమోద ముద్ర వేశారు. అయితే తాము సిఫార్సు చేసిన వారి పేర్లు లేకపోవడంతో కొందరు ప్రజాప్రతినిధులు అధికారులపై తీవ్ర ఒత్తిళ్లు చేసి అమలు చేయకుండా అడ్డుపుల్ల వేశారు. ఎట్టకేలకు ఇద్దరిని మాత్రం (జీసీడీఓ, అసిస్టెంట్‌ ఏఎంఓ) ఈ ఏడాది జూన్‌లో తీసుకున్నారు. తక్కిన పోస్టులకు మళ్లీ నోటిఫికేషన్‌ జారీ చేశారు. ఈ క్రమంలో పలువురు దరఖాస్తు చేసుకున్నారు. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయింది. సీనియార్టీ జాబితా తయారు చేశారు. మార్కులు మాత్రం బయటకు వెల్లడించకుండా అర్హులైన అభ్యర్థులను ఇంటర్వ్యూలకు పిలిచారు. ఆగస్టు రెండో వారంలో ఇంటర్వ్యూ ప్రక్రియ కూడా ముగిసింది. ఒకట్రెండు రోజుల్లో పూర్తవుతుందని భావించినా నేటికీ దీనిపై స్పష్టత లేదు.

కమిషనరేట్‌ నుంచి ఎప్పుడొస్తుందో...?

ఇంటర్వ్యూల తర్వాత అభ్యర్థులను ఎంపిక చేసి ఆమోదం కోసం కమిషనరేట్‌కు పంపామని అధికారులు చెబుతున్నారు. అక్కడి నుంచి ఎప్పుడొస్తుందనేది చెప్పడం లేదు. సెక్టోరియల్‌ ఆఫీసర్స్‌ లేక అల్లాడుతుంటే, మరోవైపు మినిస్టీరియల్‌ పోస్టులూ ఖాళీగా ఉండడం ఇబ్బందులకు గురి చేస్తోంది. ఎగ్జిక్యూటివ్‌ ఇంజినీర్‌ పోస్టు ఖాళీగా ఉంది. సూపరింటెండెంట్‌గా ఇటీవల కొత్తగా బాధ్యతలు తీసుకున్న కృష్ణారావు లాంగ్‌లీవ్‌లో వెళ్లారు. సీనియర్‌ అసిస్టెంట్‌, జూనియర్‌ అసిస్టెంట్‌ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పరిస్థితుల్లో కలెక్టర్‌ ఆనంద్‌ అయినా 'సమగ్ర శిక్ష'పై దృష్టి సారించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

జాబితాలో పేర్లపై లీకులు

కమిషనరేట్‌కు పంపిన జాబితాపై కొందరు లీకులు ఇచ్చినట్లు తెలిసింది. ఈ క్రమంలో దరఖాస్తు చేసుకున్న కొందరు తమకు అవకాశం ఇచ్చారంటూ బయట ప్రచారం చేసుకుంటున్నారు. గార్లదిన్నె మండలంలో పని చేస్తున్న ఓ ఎస్జీటీ ఇటీవల బుక్కరాయసముద్రం సమీపంలో తన సహచరులకు డిన్నర్‌ కూడా ఇచ్చారు. మరో టీచరు ప్రాథమిక విద్యలో ఒక తరగతి కన్నడ మీడియంలో చదివి, దీన్ని అడ్డుగా పెట్టుకుని అసిస్టెంట్‌ ఏఎంఓ కన్నడ పోస్టుకు ఆమోదముద్ర వేయించుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఈ రోడ్డులో ఎలా ప్రయాణించాలి?



బురద నీటిలో నిల్చుని నిరసన తెలుపుతున్న యువత

బొమ్మనహాళ్‌: అధ్వానంగా ఉన్న రోడ్డులో ఎలా ప్రయాణించాలంటూ మండలంలోని బండూరు గ్రామానికి చెందిన యువకులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం బండూరు–ఉద్దేహాళ్‌ గ్రామాల మధ్య రోడ్డుపై బురద నీటిలో నిల్చుని నిరసన తెలిపారు. వర్షాకాలంలో బురద, గుంతలతో రాకపోకలు దుర్భరంగా మారాయని వాపోయారు. పలుమార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించినా ఎటువంటి చర్యలూ తీసుకోలేదన్నారు. రోగులను ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని వాపోయారు. వెంటనే రహదారి పనులు ప్రారంభించకపోతే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం బొమ్మనహాళ్‌ తహసీల్దార్‌ మునివేలుకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో తిప్పేస్వామి, శివరామ్‌, రవి, రామృష్ణ, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కక్ష కట్టి.. కటకటాలపాలై

- గంజాయి కేసులో ట్విస్ట్‌
- స్నేహితుడిని ఇరికించాలనుకుని 'ఇరుక్కున్న' యువకుడు



చిన్నంపల్లిలో సాగు చేసిన గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

రాయదుర్గం: వారిద్దరూ స్నేహితులు. అయితే, ఇటీవల ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తాయి. ఈ క్రమంలో స్నేహితుడిని ఎలాగైనా జైలుకు పంపించాలనుకుని మరో స్నేహితుడు భావించాడు. బంధువులతో కలసి పన్నాగం పన్నాడు. చివరికి తాను పన్నిన ఉచ్చులో తానే చిక్కి కటకటాలపాలయ్యాడు. ఆదివారం రాయదుర్గంలో దొరికిన గంజాయికి సంబంధించి మొత్తం వివరాలను అర్బన్‌ సీఐ జయనాయక్‌ వెల్లడించారు. ఆయన తెలిపిన మేరకు.. పట్టణానికి చెందిన గొల్ల అఖిల్‌, ముత్తురాసి హరికృష్ణ స్నేహితులు. ఇటీవల ఇద్దరి మధ్య మనస్పర్థలు తలెత్తాయి. దీంతో అఖిల్‌ను ఎలాగైనా గంజాయి కేసులో ఇరికించి జైలుకు పంపాలని హరికృష్ణ భావించాడు. ఇందుకు తన మామ ముత్తురాసి అనిల్‌ సాయం కోరాడు. కొన్ని రోజుల క్రితం శెట్టూరు మండలం చిన్నంపల్లికి చెందిన ముత్తరాసి శంకర్‌ వద్ద రూ. 3 వేలకు 370 గ్రాముల గంజాయి కొనుగోలు చేశారు. దీంతో పాటు సుమారు 10 కిలోల బరువున్న తొమ్మిది శ్రీగంధం ముక్కలను సిద్ధం చేసుకున్నారు. గంజాయి, శ్రీ గంధం ముక్కలను ఆదివారం పట్టణంలోని కణేకల్లు రోడ్డులో నివాసం ఉండే గొల్ల అఖిల్‌ ఇంటి ముందు ఉంచే ప్రయత్నం చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు అర్బన్‌ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని ముత్తురాసి హరికృష్ణ, ముత్తురాసి అనిల్‌తో పాటు ఓ మహిళను అదుపులోకి తీసుకున్నారు. తమదైన శైలిలో విచారించగా నేరాన్ని వారు అంగీకరించారు.

తీగ లాగితే డొంక కదిలింది

నిందితుల విచారణలో కొత్త ట్విస్ట్‌ వెలుగు చూసింది. తీగ ఇక్కడ లాగితే డొంక శెట్టూరు మండలం చిన్నంపల్లికి చేరింది. గ్రామానికి చెందిన ముత్తురాసి శంకర్‌ తన పొలంలో గంజాయి మొక్కలు పెంచుతున్నాడని, అక్కడే 370 గ్రాములు కొనుగోలు చేసినట్టు పోలీసులు గుర్తించారు. సోమవారం నిందితులను వెంట తీసుకెళ్లి శంకర్‌ పొలంలో తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో మరో 214 గ్రాముల గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 584 గ్రాముల గంజాయితో పాటు 2 సెల్‌ఫోన్లు, బజాజ్‌ డిస్కవర్‌ మోటార్‌ సైకిల్‌, ఒక కొడవలి స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్టు సీఐ జయనాయక్‌ తెలిపారు. నిందితుల్ని కోర్టులో హాజరుపరచగా 14 రోజుల రిమాండ్‌ విధించారన్నారు. గంజాయి సాగు చేసిన ముత్తురాసి శంకర్‌ ఆచూకీ లభించలేదని సీఐ తెలిపారు. కేసును చాకచక్యంగా ఛేదించిన సిబ్బందికి ఎస్పీ అభినందనలు తెలిపారు.

పడిగాపులు.. ఎదురుచూపులు

- కూటమి ప్రభుత్వ అలసత్వంతో రైతులకు తప్పని అవస్థలు





ఉద్దేహాళ్‌ సొసైటీ వద్ద యూరియా కోసం ఆధార్‌కార్డులు, పాసుపుస్తకాలను క్యూలో పెట్టిన రైతులు, యూరియా కోసం ఆందోళన చేస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్‌: రైతులను యూరియా కష్టాలు వెంటాడుతున్నాయి. అన్నదాతలు ఇంకా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 'యూరియా కొరత లేదు.. ప్రతి రైతుకూ అందిస్తాం' అంటూ అధికారులు చెబుతున్న మాటలకు, క్షేత్రస్థాయిలో పరిస్థితులకు పొంతన లేకుండా పోతోంది. ఒక వైపు పొలం పనులు చేసుకుంటూనే మరో వైపు ఎరువుల కోసం పరుగులు పెట్టాల్సిన దుస్థితి నెలకొంది. బొమ్మనహాళ్‌ మండలంలోని ఉద్దేహాళ్‌, శ్రీధరఘట్ట గ్రామ సొసైటీలకు యూరియా వచ్చిందని తెలుసుకున్న రైతన్నలు సోమవారం పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. తెల్లవారుజామునే క్యూలో ఆధార్‌ కార్డులు, పాస్‌ పుస్తకాలు ఉంచారు. అరకొరగా వచ్చిన ఎరువులను కూడా పోలీసుల ఆధ్వర్యంలో పంపిణీ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. అదికూడా ఒకటి లేదా రెండు బస్తాల యూరియానే అందించడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. బాగా పలుకుబడి ఉన్న వారు, ప్రజాప్రతినిధులకు అనుకూలంగా ఉన్న వారికి 20 నుంచి 30 యూరియా బస్తాలు ఇస్తున్నారని రైతులు ఆరోపించడం గమనార్హం.

కాళ్లరిగేలా తిరుగుతున్నాం సార్‌

- గోడు వెళ్లబోసుకున్న బాధితులు
- 'పరిష్కార వేదిక'లో 540 వినతులు



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్‌ ఆనంద్‌

అనంతపురం అర్బన్‌: సమస్యల పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా పనులు జరగడం లేదని ప్రజలు వాపోయారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి కలెక్టర్‌ ఓ. ఆనంద్‌తో పాటు జాయింట్‌ కలెక్టర్‌ శివ్‌ నారాయణ్‌ శర్మ, డీఆర్‌ఓ ఎ.మలోల తదితరులు అర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 540 వినతి పత్రాలు అందాయి.

వినతుల్లో కొన్ని...

- భూమికి సంబంధించిన కేసులో అనంతపురం ఆర్డీఓ ఏకపక్షంగా వ్యవహరించి తమకు వ్యతిరేకంగా ఆర్డర్‌ ఇచ్చారని అనంతపురం రూరల్‌ మండలం నరసనాయని కుంటకు చెందిన ఎం.సుధామణి ఫిర్యాదు చేసింది. హైకోర్టులో రిట్‌ పిటీషన్‌ వేశామని, ఈ విషయాన్ని ఆర్డీఓ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకుండా సోమవారం తమకు వ్యతిరేకంగా ఆర్డర్‌ ఇచ్చారని చెప్పింది. సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని కోరింది.
- దారిని మూసి వేసి ఇబ్బంది పెడుతున్నారని గుత్తి మండలం జక్కలచెరువుకు చెందిన కృష్ణ, తదితరులు విన్నవించారు. తాము వైఎస్సార్‌ సీపీకి చెందిన వారమని వేధిస్తున్నారని వాపోయారు. 32 మంది రైతులకు సంబంధించి 200 ఎకరాలు ఉన్న భూమికి సర్వే నంబరు 91లో ఒకే ఒక రస్తా ఉందని, రస్తా మూసి వేయడంతో చాలా ఇబ్బంది పడుతున్నామని, న్యాయం చేయాలని విన్నవించారు.
- వివిధ సర్వే నంబర్లలోని 800 ఎకరాల ప్రభుత్వ భూమి తన పేరిట నమోదైందని కుందుర్పి మండలం బోదపల్లికి చెందిన బొజ్జప్ప ఫిర్యాదు చేశాడు. దీంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశాడు. న్యాయం చేయాలని కోరాడు.
- తన కష్టార్జితం 13.97 ఎకరాల భూమి తీసుకున్న ఇద్దరు కుమారులులు ఇప్పుడు పట్టించుకోవడం లేదని, దీనిపై ఆర్డీఓ కోర్టులో కేసు వేయగా తనకు అనుకూలంగా తీర్పు వచ్చిందని పెద్దపప్పూరు మండలం చిక్కేపల్లికి చెందిన వై.వెంకటరామిరెడ్డి చెప్పాడు. అయితే కుమారులు జేసీ కోర్టులో కేసు వేశారని, ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని కలెక్టర్‌ను కోరాడు.



ఇతని పేరు పుల్లారెడ్డి. వయసు 76 సంవత్సరాలు. పెద్దవడుగూరు మండలం కొట్టాలపల్లిలో నివాసముంటున్నాడు. ఇతనికి ఒక కన్ను పూర్తిగా కనిపించదు. మరో కంటికీ పూత వచ్చింది. దీనికి తోడు పక్షవాతంతో ఎడమ చేయి, కాలు సరిగ్గా పనిచేయవు. గతంలో ఇతనికి పింఛను వచ్చేది. కూటమి ప్రభుత్వం వచ్చాక వైకల్యం 40 శాతం ఉందని తొలగించారు. దివ్యాంగ పింఛను కాకపోయినా 76 ఏళ్లు ఉన్నాయి కాబట్టి వృద్ధాప్య పింఛను అయినా ఇచ్చి ఆదుకోవాలని కలెక్టర్‌కు విన్నవించాడు.

నిర్లక్ష్యానికి తావివ్వొద్దు..

జిల్లా సమగ్రాభివృద్ధికి అన్ని శాఖల అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్‌ ఓ.ఆనంద్‌ సూచించారు. 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమం ప్రారంభానికి ముందు అధికారులతో కలెక్టర్‌ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యానికి తావివ్వకుండా నాణ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు. కోర్టు కేసుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫైళ్లను ఈ–ఆఫీస్‌ ద్వారా నిర్వహించాలన్నారు.

క్లుప్తంగా

20 మండలాల్లో వర్షం

అనంతపురం అగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా తేలికపాటి వర్షాలు కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు 20 మండలాల పరిధిలో 9.1 మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. బొమ్మనహాళ్ 44.8 మి.మీ, కణేకల్లు 40, రాయదుర్గం 38.4, బెళుగుప్ప 36, వజ్రకరూరు 27.2, విడపనకల్లు 19.2, ఆత్మకూరు 18.2, నార్పల 10.6 మి.మీ వర్షం కురిసింది. మిగతా మండలాల్లో తేలికపాటి వర్షం పడింది. సెప్టెంబర్ సాధారణం 110.9 మి.మీ కాగా ఇప్పటి వరకు 80.6 మి.మీ నమోదైంది. ఓవరాల్‌గా జూన్ ఒకటి నుంచి 278.8 మి.మీ గానూ 18 శాతం అధికంగా 329.1 మి.మీ వర్షం కురిసింది. ఈ సీజన్‌లో 27 వర్షపు రోజులు (రెయినీడేస్) నమోదు కాగా 17 మండలాల్లో అధికంగానూ, 11 మండలాల్లో సాధారణం, మిగతా మూడు మండలాల్లో తక్కువగా వర్షాలు కురిశాయి.

డీఎస్సీ అభ్యర్థులకు 25న నియామక పత్రాలు

అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీ–2025కు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 25న విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్ చేతుల మీదుగా నియామకపత్రాలు అందజేస్తారని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంపికైన అభ్యర్థులు, వారికి తోడుగా వచ్చే సహాయకుల కోసం మొత్తం 45 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 24న తెల్లవారుజామున 5 గంటలలోపు అనంతపురం రూరల్ మండలం ఆలమూరు రోడ్డులోని బాలాజీ పీజీ కళాశాల వద్దకు చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు, వారి సహాయకులు ఆధార్‌కార్డు, బెడ్‌షీటు, తలదిండు, గొడుగు, స్వెటర్ తెచ్చుకోవాలని పేర్కొన్నారు. ఇదివరకే ఎంట్రన్స్ ఐడీ కార్డులు తీసుకున్న అభ్యర్థులు, సహాయకులు తప్పనిసరిగా వాటని వెంట తెచ్చుకోవాలని డీఈఓ సూచించారు.

జెడ్పీలో అక్రమాలు వెలుగు చూసేనా?

- మొదలైన అకౌంటెంట్ జనరల్ ఆడిట్ ప్రక్రియ
- పది రోజుల పాటు కొనసాగనున్న ఆడిట్

అనంతపురం సిటీ: ఉమ్మడి జిల్లా పరిషత్ కార్యాలయంలో అకౌంటెంట్ జనరల్ (ఏజీ) ఆడిట్ ప్రక్రియ మొదలైంది. విజయవాడ నుంచి వచ్చిన ముగ్గురు అధికారులతో కూడిన ప్రత్యేక బృందం అనంతపురం జెడ్పీకి సోమవారం చేరుకుంది. 2019–2020 ఆర్థిక సంవత్సరం నుంచి 15వ ఆర్థిక సంఘం, జనరల్ ఫండ్, బీఆర్‌జీఎఫ్, ఎస్ఎఫ్‌సీ, ఇతర పద్దుల కింద ఇప్పటి వరకు చేసిన పనులకు సంబంధించిన అన్ని రికార్డులూ క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. బడ్జెట్ రాబడులు–ఖర్చులకు సంబంధించిన ప్రతి అంశాన్నీ నిశితంగా చూస్తున్నారు. అయితే పాలకవర్గం అనుమతి లేకుండా కొన్ని, పాలకవర్గం తిప్పికొట్టిన మరికొన్ని పనులకు సంబంధించిన బిల్లులు గతంలో పని చేసిన సీఈఓలు, డిప్యూటీ సీఈఓలు, కిందిస్థాయి సిబ్బంది


రికార్డులు పరిశీలిస్తున్న ఆడిట్ బృందం

కుమ్మక్కై క్ర చేశారనే ఆరోపణలు బలంగా ఉన్నాయి. ముఖ్యంగా ఓఅండ్ఎంకు సంబంధించి తప్పుడు అగ్రిమెంట్లు, నకిలీ బిల్లులు పెట్టి రూ.కోట్లు కొట్టేశారని గతంలో జెడ్పీటీసీ సభ్యులు జిల్లా పరిషత్ సాధారణ, స్థాయీ సంఘాల సమావేశాల్లో నిలదీశారు. అయినా అప్పటి అధికారులు కనీస విచారణ కూడా చేయలేకపోయారు. చివరకు లోకాయుక్తకు కూడా ఫిర్యాదులు చేసిన సంగతి తెలిసిందే. గ్రామాల్లో వీఎల్‌సీ (విలేజ్ లెవల్ కమిటీ) ఆధ్వర్యంలో చేపట్టాల్సిన పనులను కూడా కొందరు అధికారులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై, బినామీ పేర్లతో పూర్తి చేసి రూ.కోట్లు స్వాహా చేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా కదిరి నియోజకవర్గంలోని ఓ మారుమూల మండలంలో రూ.2 కోట్లకు పైగా ఇలా నిధులను ఓ అధికారి మరో కాంట్రాక్టర్‌తో చేతులు కలిపి దిగమింగారని తెలుస్తోంది. ఈ విషయంపై ప్రభుత్వానికి కూడా ఫిర్యాదులు వెళ్లాయని సమాచారం. ఈ నేపథ్యంలో ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ కార్యాలయం నుంచి వచ్చిన ఆడిట్ అధికారుల పరిశీలనలో అక్రమాలు వెలుగు చూసేనా అని అందరూ ఎదురు చూస్తున్నారు. సుమారు పది రోజుల పాటు ఏజీ ఆడిట్ ప్రక్రియ కొనసాగుతుందని జెడ్పీ వర్గాలు తెలిపాయి. నిష్పక్షపాతంగా ఆడిట్ ప్రక్రియ కొనసాగితే అక్రమాలు వెలుగు చూసే అవకాశం లేకపోలేదని జెడ్పీ వర్గాలే అంటున్నాయి. మరి ఏం జరుగుతుందో వేచి చూడాలి.

సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమమే

- వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకాశి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వీఆర్‌ఏలు

అనంతపురం అర్బన్: సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని వీఆర్‌ఏల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకాశి స్పష్టం చేశారు. వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ అధ్యక్షతన సోమవారం కలెక్టరేట్ ఎదుట వీఆర్‌ఏలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలకాశి మాట్లాడుతూ వీఆర్‌ఏలకు పేస్కేల్ రూ.30 వేలు వర్తింపజేయాలన్నారు. డీఏలతో వేతనం ఇవ్వాలన్నారు. కుటుంబ సభ్యులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. విద్యార్హతను బట్టి పదోన్నతులు కల్పించాలన్నారు. నామినీ వీఆర్‌ఏలను రెగ్యులర్ వీఆర్‌ఏలుగా మార్పు చేయాలన్నారు. వీఆర్‌ఏలకు పదోన్నతి కల్పించడం ద్వారా వీఆర్‌ఓ పోస్టులు 70 శాతం భర్తీ చేయాలన్నారు. విధినిర్వహణలో వీఆర్‌ఓ మరణిస్తే ఆయన కుటుంబంలో ఒకరికి వీఆర్‌ఏ ఉద్యోగం ఇవ్వాలన్నారు. కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలన్నారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పరమేశ్వరప్ప, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు విజయ్, వీఆర్‌ఏ సంఘం నాయకులు సుధాకర్, సుబ్రమణ్యం, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సెపక్‌తక్రా పోటీల రన్నర్ ‘అనంత’

- ముగిసిన రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలు


రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా ఫైనల్ పోటీల్లో తలపడిన అనంతపురం–కృష్ణా జిల్లాల జట్లు

ఉరవకొండ: రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీల ఓవరాల్ విజేతగా కృష్ణా జిల్లా బాలబాలికల జట్లు నిలిచాయి. ఉరవకొండలోని జెడ్పీ సెంట్రల్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 21 నుంచి జరుగుతున్న 28వ సబ్ జూనియర్ రాష్ట్రస్థాయి సెపక్ తక్రా పోటీలు సోమవారం ముగిశాయి. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాల నుంచి సబ్ జూనియర్ బాల, బాలికల జట్లు పాల్గొన్నాయి. అనంతపురం, కృష్ణా జిల్లాల బాలబాలికల జట్లు ఫైనల్స్‌లో తలపడ్డాయి. హోరాహోరీగా సాగిన ఈ పోటీల్లో కృష్ణా జిల్లాకు చెందిన బాల, బాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. అనంతపురం జిల్లా జట్లు రన్నరప్స్‌తో సరిపెట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతుల ప్రదానోత్సవ సభలో ముఖ్య అతిథిగా భారతదేశ సెపక్‌తక్రా క్రీడల సంఘం ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా చైర్మన్ సప్తగిరి మల్లి, కార్యదర్శి షాహిన్, ఎస్‌కెఆర్‌సీ క్లబ్ ఉపాధ్యక్షులు ఎర్రిస్వామినాయుడు, ఆమిద్యాల రాజశేఖర్ హాజరయ్యారు. గెలుపోటములను సమానంగా స్వీకరించినపుడే క్రీడల్లో రాణిస్తారని వక్తలు తెలిపారు. అనంతరం విన్నర్స్, రన్నర్స్ జట్లకు పతకాలు, కప్‌లు, సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో సీనియర్ పీడీలు మారుతి ప్రసాద్, పుల్లా రాఘవేంద్ర, నాగరాజు, ప్రభాకర్, మంజునాథ్, జనార్దన్, శివకుమార్, రాయుడు, కృష్ణ, నాగేంద్ర పాల్గొన్నారు.

‘మూల్యాంకనం’ రెమ్యునరేషన్ చెల్లించండి


డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: పదో తరగతి మూల్యాంకన విధులకు సంబంధించిన రెమ్యునరేషన్, టీఏ, డీఏ చెల్లించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఎస్టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు కాడిశెట్టి శ్రీనివాసులు, శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు డి.మారుతి ప్రసాద్, కోశాధికారి ప్రదీప్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం అనంతపురం డీఈఓ ఎం.ప్రసాద్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదో తరగతి వార్షిక పరీక్షలు–25లో సిట్టింగ్ స్క్వాడ్ పారితోషికం పెండింగ్ ఉందన్నారు. 2008, 2018 డీఎస్సీ ఉపాధ్యాయులకు జాయినింగ్ తేదీలు వేర్వేరుగా ఉన్నందున బదిలీల్లో పాయింట్ల తేడా ఎక్కువగా ఉందన్నారు. ఒకే తేదీ జాయినింగ్ ఉండేలా ఉత్తర్వులు ఇవ్వాలన్నారు. బదిలీ అయి రిలీవర్ లేని కారణంగా తిరిగి పాతస్థానాల్లో పనిచేసే ఉపాధ్యాయులను రిలీవ్ చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. సూపర్ న్యూమరీ పోస్టులను సృష్టించి భాషా పండితులు, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలన్నారు. ఉపాధ్యాయులకు బోధనేతర కార్యక్రమాలు లేకుండా చూడాలన్నారు. అసెస్‌మెంట్ పుస్తకాల నిర్వహణపై పునఃసమీక్షించాలన్నారు. హైస్కూల్ ప్లస్‌లలో ఖాళీ స్థానాలలో ఉపాధ్యాయుల నియామకం చేపట్టి వాటిని యథావిధిగా కొనసాగించాలన్నారు. మునిసిపల్ ఉపాధ్యాయులకు జీపీఎఫ్ సమస్యలను పరిష్కరించాలని, మోడల్ స్కూల్ టీచర్లకు సర్వీస్ రూల్స్ ప్రకటించాలన్నారు. విద్యా శక్తి కార్యక్రమం ఐచ్ఛికంగా నిర్వహించాలని కోరారు.

‘బలిజలకు మేలు చేసిందేమీ లేదు’

గుత్తి: బలిజ కులస్తులను అగౌరవపరిచే విధంగా ఉన్న జీఓ నంబర్–5ను వెంటనే రద్దు చేయాలని రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షుడు చందూ జనార్దన్ డిమాండ్ చేశారు. రాయలసీమ పర్యటనలో భాగంగా సోమవారం గుత్తికి విచ్చేసిన ఆయన ఆర్అండ్‌బీ బంగ్లాలో బలిజ సంఘం నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం దొమ్మర్లను తీసుకొచ్చి బలిజ కులంలో కలిపి ‘గిరి బలిజ’ అనే నామకరణ చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇది బలిజలను అగౌరవ పరచడమేనన్నారు. వెంటనే జీఓ–5 ను రద్దు చేయాలన్నారు. గిరి బలిజలో ‘బలిజ’ పదాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చి 15 మాసాలు గడిచిపోయినా ఇంతవరకు బలిజలకు ఏమీ చేయలేదని ధ్వజమెత్తారు. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పందించాలని కోరారు. కూటమి లో జనసేన భాగస్వామి అయినప్పటికీ జన సైనికులకు పదవుల కేటాయింపులో సముచిత న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బలిజ సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే ఆమరణ దీక్ష చేస్తానన్నారు. అనంతరం కాపు ఉద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంతవరకు కాపు ఉద్యోగుల సమస్య ఒక్కటీ పరిష్కారం చేయలేదన్నారు. పది లక్షల మంది ఉద్యోగులు ఉద్యమ బాట పట్టడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గుంతకల్లు, గుత్తి బలిజ సంఘం అధ్యక్షులు పూల రమణ, మారాకుల రమణ, ఉపాధ్యక్షులు శ్రీకరం గోవింద రాజులు, సీనియర్ నాయకులు నరేష్, గోరంట్ల నాగయ్య, మంజు, మోహన్, హరి, ఈశ్వరయ్య, రాజశేఖర్, నాగరాజు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర కాపు జేఏసీ అధ్యక్షుడు చందూ జనార్దన్

అదనపు కట్నం కోసం పోలీస్ వేధింపులు

రాప్తాడురూరల్: అదనపు కట్నం కోసం పోలీసు కానిస్టేబుల్ వేధించిన సంఘటన అనంతపురం రూరల్ మండలం పాపంపేటలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ధర్మవరానికి చెందిన సూర్యనారాయణ, ఉరవకొండ ప్రాంతవాసి గాయత్రికి పదేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, కూతురు సంతానం. వీరి కుటుంబం అనంతపురం రూరల్ పాపంపేటలో నివాసం ఉంటోంది. సూర్యనారాయణ కళ్యాణదుర్గం టౌన్ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. ఇటీవల అదనపు కట్నంపై ఆశపుట్టిన సూర్యనారాయణ తరచూ భార్యను వేధింపులకు గురి చేసేవాడు. పెద్దలు ఎన్నిమార్లు సర్దిచెప్పినా ఆయనలో మార్పు రాలేదు. సోమవారం భార్యపై విచక్షణారహితంగా దాడి చేశాడు. గాయాలపాలైన బాధితురాలు సర్వజన ఆస్పత్రిలో చేరింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు అనంతపురం రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

చౌక బియ్యం పట్టివేత

పెద్దపప్పూరు: అమ్మలదిన్నెలో సూర్యనారాయణ అనే వ్యక్తి వద్ద నిల్వ ఉంచిన 15 బస్తాల చౌక బియ్యాన్ని సోమవారం పట్టుకుని, కేసు నమోదు చేశామని ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. బియ్యాన్ని సివిల్ సప్లయీస్ అధికారులకు స్వాధీనం చేశామన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా పేదలకు అందించే చౌక బియ్యాన్ని ఎవ్వరు కొనుగోలు చేసినా, అక్రమంగా రవాణా చేసినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి


ధర్నా చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు

అనంతపురం అర్బన్: విద్యుత్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగ, కార్మిక సంఘం జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదురుగా సంఘం ఆధ్వర్యంలో ఉద్యోగ, కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ జీటీ శ్రీనివాసులు, కన్వీనర్ హర్ష మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగులకు, పెన్షనర్లకు వారి కుటుంబ సభ్యులకు పూర్తిగా వైద్య ఖర్చులు చెల్లించాలన్నారు. కాంట్రాక్టు కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. దీర్ఘకాలిక సర్వీసు ఉన్న వారిని సంస్థలో విలీనం చేయాలన్నారు. కారుణ్య నియామకాలు కల్పించడంలో కన్సాలిడేటెడ్ పే విధానాన్ని రద్దు చేసి పాత విధానాన్ని కొనసాగించాలన్నారు. 2019లో నియమించిన ఎనర్జీ అసిస్టెంట్లు (జేఎల్ఎం గ్రేడ్–2)లను రెగ్యులర్ జేఎల్ఎంలుగా పరిగణించి వేతనాల, ఇతర ప్రయోజనాలు కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను మంజూరు చేయాలన్నారు. అమలులో ఉన్న ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ ప్రకారం స్కేల్ రూపాందించాలన్నారు. ఇలా తమ న్యాయమైన అన్ని డిమాండ్లను పరిష్కరించాలని, లేకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌ను నాయకులు కలిసి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో జేఏసీ కో–కన్వీనర్లు శ్రీనివాసులు, జితేంద్ర, జిలాన్, రాము, నాగార్జున, ఎస్ఎం బాషా పాల్గొన్నారు.

కాసం ఫ్యాషన్స్ ప్రారంభం


కాసం ఫ్యాషన్స్‌లో చీరను ప్రదర్శిస్తున్న నిధి అగర్వాల్

గుంతకల్లు: కాసం ఫ్యాషన్స్ వారి 19వ స్టోర్ గుంతకల్లులోని రైల్వేస్టేషన్ రోడ్డులో సోమవారం ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా సినీనటి నిధి అగర్వాల్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి షాపింగ్ మాల్ ప్రారంభించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఫ్యాషన్ అభిరుచి ఉన్నవారు గతంలో నగరాలకు వెళ్లి షాపింగ్ చేసేవారన్నారు. ఇప్పుడు అధునాతన కలెక్షన్స్, నిత్యం నూతన వెరైటీలు కాసం ఫ్యాషన్స్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. షాపింగ్ మాల్ డైరెక్టర్లు కాసం నమశ్శివాయ, కాసం మల్లికార్జున, కాసం కేదారినాథ్, కాసం శివప్రసాద్ మాట్లాడుతూ తగ్గిన జీఎస్టీకి అనుగుణంగా తక్కువ ధరకే తమ షాపుల్లో వస్త్రాలు లభిస్తాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం నిధి అగర్వాల్ మాల్‌లో కలియదిరిగారు. షాపింగ్ మాల్ ముందు ఏర్పాటు చేసిన స్టేజ్‌పై అభివాదం చేస్తూ సినీ పాటకు డాన్స్ వేసి అభిమానులను అలరించారు. కార్యక్రమంలో కాసం ఫ్యాషన్ యాజమాన్యం అరుణ్‌కుమార్, విశాల్, వరుణ్, కార్తీక్, సాయి పాల్గొన్నారు.

భార్య మందలించిందని ఆత్మహత్య


కురుబ మోహన్

బొమ్మనహాళ్: భార్య మందలించిందని మనస్తాపానికి గురైన భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ నబీరసూల్ తెలిపిన వివరాల మేరకు.. సింగానహళ్లికి చెందిన కురుబ మోహన్ (41) మద్యానికి బానిసై జులాయిగా తిరుగుతుండేవాడు. కొద్దిరోజుల క్రితం ఇంటి వద్దనున్న బైక్‌ను ఎక్కడో కుదువపెట్టి వచ్చిన డబ్బుతో పూటుగా మద్యం తాగొచ్చాడు. ఈ విషయమై భార్య గీత మందలించడంతో మనస్తాపానికి గురైన మోహన్ ఆదివారం ఇంట్లోనే గడ్డికి కొట్టే మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి బళ్లారిలోని విమ్స్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి సోమవారం ఉదయం మోహన్ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి



నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

అనంతపురం అర్బన్: సమస్యలు పరిష్కరించాలంటూ దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో దివ్యాంగులు సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సమితి కో–ఆర్డినేటర్ హరినాథరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులకు బ్యాక్‌లాగ్ పోస్టులు మంజూరు చేసి భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సమితి మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి తదితరులున్నారు.

క్షురకులను ఆదుకోవాలి

అనంతపురం అర్బన్: కార్పొరేట్ సెలూన్ షాపులను తొలగించి సంప్రదాయ క్షురక కులవృత్తిదారులను ఆదుకోవాలని ఏపీ క్షురక వృత్తిదారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, కార్యదర్శి సూరి మాట్లాడారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి వృత్తిదారుల సంఘం నాయకులు బి.శ్రీనివాసులు, బాలరంగయ్య తదితరులు పాల్గొన్నారు.

బదిలీ ఉద్యోగులకు సన్మానం



బదిలీ అయిన ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం

రాప్తాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్డీగా విధులు నిర్వహిస్తున్న ఆనంద్ ప్రసాద్ పదోన్నతి పొంది రొద్దం మండలానికి ఎంపీడీఓగా బదిలీ అయ్యారు. అలాగే మండలంలోని ఏడుగురు గ్రామ కార్యదర్శులు ఇతర మండలాలకు బదిలీ అయ్యారు. వీరందరినీ సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు.

రూ.44.45 లక్షల రుణం మంజూరు

రాప్తాడు: అనంత సిరి మహిళా కో ఆపరేటివ్ బ్యాంకు ద్వారా సోమవారం 203 మంది మహిళలకు రూ.44,45,000 రుణం మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీటీ రీజనల్ డైరెక్టర్ లక్ష్మణ్ రావు మాట్లాడుతూ ఆర్డీటీ సంస్థ ద్వారా శిక్షణ పొందిన మహిళలు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం ఆనందంగా ఉందన్నారు. మహిళలు తమ పొదుపు డబ్బుతో బ్యాంకును ఏర్పాటు చేసుకొని వాటాదారులుగా చేరి స్వయంగా ఒక బ్యాంకును నడపడం చాలా గొప్ప విషయమన్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న టిప్పర్



అనంతపురం: నగరంలోని టీవీ టవర్ వద్ద ఆర్టీసీ బస్సును సోమవారం టిప్పర్ వెనక వైపు నుంచి ఢీ కొంది. డోర్‌లో ఉన్న ప్రయాణికులు కిందకు దూకడంతో స్వల్ప గాయాలయ్యాయి. ఇరు వర్గాల వారు రాజీ పడడంతో పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయలేదు.

పంట కోత ప్రయోగాలపై శిక్షణ

ఆత్మకూరు: పంటకోత ప్రయోగాలకు సంబంధించి సోమవారం స్థానిక రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఏఎస్ఓ మమత, వ్యవసాయ అధికారి విజయ్ పంటల దిగుబడులను అంచనా వేసే పంట కోత ప్రయోగాలు ఎలా చేయాలన్న దాని గురించి వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ అక్కమ్మ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ వైద్యులుగా ఎదగాలి

అనంతపురం మెడికల్: తల్లిదండ్రుల ఆశయాలకనుగుణంగా ఉత్తమ వైద్యులుగా ఎదగాలని ప్రిన్సిపాల్ డాక్టర్ విజయశ్రీ సూచించారు. సోమవారం ప్రభుత్వ వైద్య కళాశాలలో 2కె25 బ్యాచ్ వైద్య విద్యార్థుల పరిచయ కార్యక్రమం జరిగింది. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షంషాద్ బేగం, డాక్టర్ షారోన్ సోనియా, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ బెనడెక్ట్, వైద్యులు డాక్టర్ రవికుమార్, డాక్టర్ సరళ, డాక్టర్ శివశంకర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లందరికీ సాయమందించాలి

అనంతపురం అర్బన్: వాహన డ్రైవర్లందరికీ రూ.15 వేల ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన హామీని సీఎం అమలు చేయాలని జయహో రథసారథి డ్రైవర్ల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పరిష్కార వేదిక కార్యక్రమంలో డీఆర్ఓ ఎ.మలోలకు సంఘం జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ వినతిపత్రం అందజేశారు.

జగన్మాతకు జన నీరాజనం



గుత్తి రోడ్డులోని చౌడేశ్వరి ఆలయంలో ప్రత్యేక అలంకరణ



బాలయోగి ఆశ్రమంలో అలంకరణలో అమ్మవారు




నాల్గో రోడ్డులో శృంఖలాదేవి అమ్మవారు



శంకరమఠంలో పూజలు అందుకున్న శారదాదేవి



ఉమానగర్‌లో రేణుకా యల్లమ్మ



తపోవనంలో వేదమాత గాయత్రీదేవి గౌరీదేవిగా దర్శనం

అనంతపురం కల్చరల్: దసరా శరన్నవరాత్రి వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు వాడవాడలా అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చారు. ప్రధానంగా కొత్తూరు, పాతూరు వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాలు పోటెత్తిన భక్తులతో కిటకిటలాడాయి. వాసవీమాతకు పసుపు, అక్షితల అలంకారంలో పూజలు చేశారు. శివ కుటుంబంగా అవతరించిన వాసవీమాతను పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో ఆలయ అధికారి నాగేంద్రుడు, భక్తమండలి సభ్యులు ఉత్సవాలను ఆరంభించారు. సాయంత్రం బ్రాహ్మణి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. రెండో రోడ్డులోని శ్రీచంద్రశేఖరేంద్ర పీఠంలో మధుసూదనరావు నేతృత్వంలో దసరా ఉత్సవాలను హోమాలతో శాస్త్రోక్తంగా శ్రీకారం చుట్టారు. బాలయోగి ఆశ్రమంలో భరతమాత అలంకారం, ఐదో రోడ్డులోని నల్లమల సుంకులమ్మ తల్లి, సున్నంగేరు, ఉమానగర్‌లోని రేణుకా యల్లమ్మ తల్లి, హెచ్చెల్సీ కాలనీ శ్రీ నసనకోట ముత్యాలమ్మకు రాజరాజేశ్వరి అలంకారం, కొల్హాపూర్ మహాలక్ష్మి, శివకోటి, శంకర మఠం తదితర చోట్ల అమ్మవారు వివిధ అలంకార సేవల్లో ప్రత్యేక పూజలందుకుంది.

మార్మోగిన లలితాసహస్రనామం

మానవ మనుగడకు ఆధ్యాత్మిక చింతన ఎంతగానో దోహదపడుతుందని చిన్మయామిషన్ స్వామీ ఆత్మవిదానంద సరస్వతి అన్నారు. దసరా వేడుకల సందర్భంగా తపోవనంలోని చిన్మయాజగదీశ్వరాలయంలో సోమవారం సామూహిక లలితాసహస్ర నామ పారాయణ జపాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన దసరా శరన్నవ రాత్రుల ఉత్సవాల ప్రాధాన్యతను తెలియజేశారు.



శంకర మఠంలో నృత్య ప్రదర్శనలు



భక్తులతో కిక్కిరిసిన పాతూరు అమ్మవారి శాల

అనంతరం తీర్థప్రసాద వితరణ జరిగింది.

ఆకట్టుకున్న నృత్యాలు..


అరవింద నృత్యశిక్షణాలయం ఆధ్వర్యంలో స్థానిక శారదాశృంగేరీ శంకరమఠంలో చిన్నారులు శాస్త్రీయ నృత్యాలతో అమ్మవారికి భక్తినీరాజనాలర్పించారు. అన్నమయ్య, త్యాగయ్య కృతులపై నర్తించిన చిన్నారులను అభినందిస్తూ మఠం ప్రతినిధి సత్యప్రసాద్, కమిటీ సభ్యులు డ్యాన్సుమాస్టర్ సురేష్‌ను, చిన్నారులను సత్కరించారు. ప్రశంసాపత్రాలు అందించారు.

బాలాత్రిపుర సుందరీదేవిగా దుర్గాదేవి

రాప్తాడు: దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌లోని గౌరీ ప్రసన్నేశ్వర స్వామి దేవాలయంలో దుర్గాదేవి, ఇందిరమ్మ కాలనీలో దుర్గాదేవి సోమవారం బాలా త్రిపుర సుందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రాప్తాడులోని ఉమా నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో పార్వతి దేవి, పెద్దమ్మ, మారెమ్మ, మరిగమ్మ, గంగలకుంట గ్రామంలో దుర్గాదేవి, బుక్కచెర్లలో నల్లలమ్మ దేవతలు బాలా త్రిపుర సుందరీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు.



పసుపు, కుంకుమ అలంకారంలో కొత్తూరులోని వాసవీమాత



పాతూరులో వాసవీ మాత



టౌన్‌బ్యాంకు వద్ద కొలువుదీరిన అమ్మవారు

తోపుదుర్తి భాస్కర్‌రెడ్డికి నివాళి





తోపుదుర్తి భాస్కర్‌రెడ్డికి నివాళులర్పించేందుకు వచ్చిన భూమన కరుణాకర్ రెడ్డి, అనంత వెంకటరామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తదితరులు

అనంతపురం కార్పొరేషన్: ఇటీవల ఆకస్మిక మరణం పొందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత తోపుదుర్తి భాస్కర్‌రెడ్డి చిత్రపటానికి వైఎస్సార్ సీపీ ప్రముఖులు నివాళులర్పించారు. సోమవారం నగరంలోని రామచంద్రనగర్‌లోని తోపుదుర్తి భాస్కర్ రెడ్డి నివాసంలో వైకుంఠ సమారాధన కార్యక్రమం జరిగింది. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, మాజీ మంత్రులు జేసీ దివాకర్ రెడ్డి, డాక్టర్ సాకే శైలజానాథ్, మాజీ ఎమ్మెల్యేలు విశ్వేశ్వర రెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎన్ఆర్ఐ విభాగం కో ఆర్డినేటర్ ఆలూరు సాంబశివారెడ్డి, మేయర్ వసీం, వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కొండ్రెడ్డి ప్రకాష్ రెడ్డి, సీనియర్ జర్నలిస్టు పలవలీ రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని యువత చైతన్యపరచాలి

అనంతపురం కల్చరల్: మత్తు పదార్థాలతో చిత్తవుతున్న సమాజాన్ని చైతన్యపరచాల్సిన బాధ్యత యువతపై ఉందని వక్తలు అన్నారు. సోమవారం నిగమా ఫౌండేషన్, మై భారత్, ప్రగతిపథం యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నషాముక్త్ యువ ఫర్ వికసిత భారత్‌పై అవగాహన సదస్సు జరిగింది. ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు వసుంధర, మై భారత్ రాష్ట్ర కో ఆర్డినేటర్ బిసాతి భరత్, ప్రోగ్రాం ఇన్‌చార్జ్ గోవర్దన శ్రీనివాసులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జీవన్‌కుమార్, జయమారుతి డాక్టర్ ఎం. మురళీ తదితరులు వలంటీర్లనుద్దేశించి మాట్లాడారు. మై భారత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా చెడువ్యసనాలకు దూరంగా ఉండడానికి కేంద్రప్రభుత్వం నషా ముక్త్ అభియాన్ పై విస్తృత అవగాహన కల్పిస్తోందన్నారు. ఎన్‌సీసీ సిల్వర్ మెడల్స్ సాధించిన క్యాడెట్స్‌ను సత్కరించారు. కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు కార్తీక్, ప్రవీణ్, షర్మిల, మల్లీశ్వరి, గోపి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన కమిషనర్లు



కలెక్టర్ ఆనంద్‌తో మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, కమిషనర్లు

అనంతపురం కార్పొరేషన్: కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆనంద్‌ను జిల్లాలోని నగరపాలక సంస్థ, వివిధ మునిసిపాలిటీల కమిషనర్లు సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు వారు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. కలెక్టర్‌ను కలసిన వారిలో నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, తాడిపత్రి కమిషనర్ శివరామకృష్ణ, గుత్తి కమిషనర్ జబ్బార్ మియా, రాయదుర్గం కమిషనర్ దివాకర్ రెడ్డి, కళ్యాణదుర్గం కమిషనర్ వంశీకృష్ణ తదితరులు ఉన్నారు.

రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక పాలన



క్లాక్‌టవర్ వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

అనంతపురం అర్బన్: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మిక వ్యతిరేక పాలన సాగిస్తోందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్ ధ్వజమెత్తారు. కార్మికులకు ఎనిమిది గంటల పనివిధానాన్ని పదిగంటల పనివిధానంగా మార్చే నిర్ణయాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక క్లాక్‌టవర్ వద్ద నాయకులు, కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగేంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మిక వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయన్నారు. రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. అందులో భాగంగానే కార్మికులు, ఉద్యోగులకు చట్టబద్ధ హక్కుగా ఉన్న ఎనిమిది గంటల పనివిధానాన్ని 10 గంటలకు మార్చాలనే నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. 1948లో పారిశ్రామిక చట్టం దేశంలో ప్రారంభమైనప్పటి నుంచి ఎనిమిది గంటల పని విధానాన్ని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కడం అత్యంత హేయమైన చర్యని దుమ్మెత్తిపోశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో కార్మికశక్తి ఆగ్రహానికి గురికాకతప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు గోపాల్, ముత్తుజా, రామాంజనేయులు, వెంకటనారాయణ, మనోహర్, చంద్ర, స్వాతి, నల్లమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పాలసీలపై జీఎస్టీ ఎత్తివేత అభినందనీయం



కేక్ కట్ చేస్తున్న లియాఫీ నాయకులు, అధికారులు

అనంతపురం అగ్రికల్చర్: వ్యక్తిగత జీవిత బీమా పాలసీలు, బీమా పాలసీలు, ఆగరోగ్య బీమా పాలసీలపై జీఎస్టీ ఎత్తివేయడం అభినందనీయమని ఎల్ఐసీ ఏజెంట్ల సమాఖ్య (లియాఫీ) నాయకులు, ఎల్ఐసీ ఆఫీసు సిబ్బంది సోమవారం స్థానిక ఎల్ఐసీ బ్రాంచి–1 కార్యాలయం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. సీనియర్ బ్రాంచి మేనేజర్ మధుబాబు, కడప డివిజన్ లియాఫీ గౌరవాధ్యక్షులు ఎస్.తిరుపతయ్య, కార్యదర్శి కె.వెంకటేశులు తదితరులు మాట్లాడుతూ పాలసీదారులపై జీఎస్టీ తొలగించాలనే డిమాండ్‌తో దేశవ్యాప్తంగా అనేక ఉద్యమాలు, పోరాటాలు, చివరకు ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నా కూడా చేశామని లియాఫీ నాయకులు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఓలు రమామణి, రమణానాయక్, అజయకుమార్, లియాఫీ నాయకులు సూరిబాబు, వేణుగోపాల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి కష్టాలు



కలెక్టర్ ఆనంద్‌కు సమస్యలు వివరిస్తున్న వైఎస్సార్‌ఎస్‌యూ నాయకులు

అనంతపురం అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో తాగునీటి కష్టాలు నెలకొన్నాయని కలెక్టర్ ఆనంద్‌కు వైఎస్సార్ ఎస్‌యూ నాయకులు విన్నవించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలెక్టర్‌కు సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్, నాయకులు వినతిపత్రం అందజేసి సమస్యలు వివరించారు. పాఠశాలల్లో విద్యార్థులకు రక్షిత మంచి నీరు అందక అనారోగ్యం పాలవుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో అమర్చిన ఆర్‌ఓ ప్లాంట్ చెడిపోయినా మరమ్మతుకు నోచుకోవడం లేదన్నారు. మినరల్ ప్లాంట్‌లు లేని పాఠశాలల్లో కొత్తవాటిని ఏర్పాటు చేయాలని, చెడిపోయిన వాటిని మరమ్మతు చేయించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మంజునాథ్‌రెడ్డి, వెంకటేష్ రాయల్, నిశాంత్‌రెడ్డి, అశోక్, కైలాష్, ఫయాజ్, అశోక్ రాయల్, రమేష్, లోకేష్, నవీన్, ఆదిల్, వంశీనాయుడు, సురేంద్ర, రాహుల్‌రెడ్డి, సాయి యాదవ్, సూర్య, శివ పాల్గొన్నారు.

అర్జీలు పునరావృతం కారాదు



పిటీషనర్లతో మాట్లాడుతున్న ఎస్పీ జగదీష్

అనంతపురం: అర్జీలు పునరావృతం కారాదని ఎస్పీ జగదీష్ పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను ఎస్పీ నిర్వహించారు. ప్రజల సమస్యలను నేరుగా విని, అర్జీలు స్వీకరించారు. విచారణ జరిపి వెంటనే బాధితులకు న్యాయం చేయాలని ఆయా పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఎస్.మహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్స్ అరుదైన ఘనత

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ) ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్స్ అరుదైన ఘనత సాధించారు. ఎన్‌సీసీ క్యాడెట్స్ సీనియర్ అండర్ ఆఫీసర్ (ఎస్‌యూఓ) కె.ప్రణతి (కంప్యూటర్స్ సైన్స్ విభాగం), కేడెట్ కేఎం అఖిల (సివిల్), బి.సౌజన్య (ఈసీఈ), పి.నఫియా (ఈఈఈ) ఏపీ, తెలంగాణ డైరెక్టరేట్ తరఫున ఈ నెల 1 నుంచి 12 వరకు నిర్వహించిన ఆల్ ఇండియా థల్ సైనిక్ క్యాంప్‌లో పాల్గొన్నారు. 70 రోజుల పాటు బ్రాహ్మణపల్లిలో నిర్వహించిన ఏడు ఎంపిక శిబిరాల్లో శిక్షణలో నిష్ణాతులైన వారిని ఈ క్యాంప్‌నకు ఎంపిక చేశారు. వీరిలో ప్రతిభ, సౌజన్య జడ్జింగ్ డిస్టెన్స్, ఫీల్డ్ సిగ్నల్స్ విభాగంలో, అఖిల, నఫియా మ్యాప్ రీడింగ్‌లో ప్రతిభ ప్రదర్శించి సత్తా చాటారు. ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో దేశవ్యాప్తంగా ఆరో స్థానం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎస్.కృష్ణయ్య తదితరులు అభినందించారు.

ప్రైవేట్ డిగ్రీ కళాశాలల బంద్‌కు పీడీఎస్‌యూ మద్దతు



బంద్‌లో పాల్గొన్న పీడీఎస్‌యూ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: పెండింగ్‌లో ఉన్న రూ. 6,400 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ బకాయిలు విడుదల చేయాలని ప్రైవేటు విద్యా సంస్థల యాజమాన్యాలు సోమవారం తలపెట్టిన 'విద్యాసంస్థల బంద్'కు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. వీరేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల ముందు నారా లోకేష్ తాము అధికారంలోకి వస్తే ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ నేడు మాట తప్పి దాదాపు రూ. 6,400 కోట్లు పెండింగ్ పెట్టారన్నారు. 'సూపర్ సిక్స్ –సూపర్ హిట్' సభ పేరిట కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ, విద్యార్థుల ఫీజులను చెల్లించడంలో సవతి ప్రేమ చూపుతున్నారన్నారు. ఇప్పటికైనా స్పందించి వెంటనే ఫీజు బకాయిలు చెల్లించాలని, లేదంటే రాబోయే రోజుల్లో ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు తేజ, దివాకర్, కిరణ్, ప్రభాకర్, దివాకర్ పాల్గొన్నారు.

ఏపీఎంఐపీకి కలెక్టర్ అభినందన

అనంతపురం అగ్రికల్చర్: ప్రతిష్టాత్మక 'స్కోచ్' గోల్డ్ అవార్డు కైవసం చేసుకున్న ఏపీఎంఐపీ, ఉద్యానశాఖ అధికారులను కలెక్టర్ ఓ.ఆనంద్ అభినందించారు. సోమవారం స్థానిక రెవెన్యూభవన్‌లో జాయింట్ కలెక్టర్ శివ్‌నారాయణశర్మ, ఏపీఎంఐపీ పీడీ బి.రఘునాథరెడ్డి, ఉద్యానశాఖ డీడీ డి.ఉమాదేవితో కలిసి జిల్లాకు ప్రదానం చేసిన స్కోచ్ అవార్డును ప్రదర్శించారు. శనివారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో స్కోచ్ గ్రూపు వ్యవస్థాపక చైర్మన్ సమీర్ కొచ్చర్ చేతుల మీదుగా అప్పటి ఏపీడీ జి.ఫిరోజ్ ఖాన్‌తో కలిసి అవార్డు అందుకున్నట్లు పీడీ రఘునాథరెడ్డి తెలిపారు.

శ్రీనివాసుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

అనంతపురం కల్చరల్: శ్రీనివాసుని బ్రహ్మోత్సవాలకు వేదపండితులు శ్రీకారం చుట్టారు. స్థానిక ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గణపతి హోమం, యాగమండప ప్రవేశం, ఉదయం శ్రీవారికి పంచామృతాభిషేక సహిత అలంకార సేవల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ముఖ్యంగా అంకురార్పణ పూజలతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు.

మహిళల ఆరోగ్యంతోనే కుటుంబం సురక్షితం

రాప్తాడు: మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం సురక్షితంగా ఉంటుందని రాప్తాడు ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి శివ కృష్ణ తెలిపారు. సోమవారం మండలంలోని ఎం.చెర్లోపల్లి గ్రామంలోని సచివాలయం వద్ద 'స్వస్థ్ నారీ–సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు మాట్లాడుతూ...మహిళల ఆరోగ్యంపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయన్నారు. అనంతరం 60 మంది మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు అరుణ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో రైతులకు కష్టాలు

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వ పాలనలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని కాంగ్రెస్ నాయకులు ధ్వజమెత్తారు. నష్టపోయిన చీనీ రైతులకు గత ప్రభుత్వం హెక్టార్‌కు రూ.25 వేలు పరిహారం ఇచ్చిన విధంగా కూటమి ప్రభుత్వమూ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులను ఆదుకోవాలంటూ కాంగ్రెస్ కిసాన్ సెల్ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షుడు కృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మైనారిటీ సెల్ రాష్ట్ర చైర్మన్ దాదాగాంధీ మాట్లాడారు. రైతులకు యూరియా అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. గంటల తరబడి క్యూలో నిల్చున్నా యూరియా అందని పరిస్థితి నెలకొందన్నారు. గిట్టుబాటు ధర లేక చీనీ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని పంటలకు గిట్టుబాటు ధరతో ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. అనంతరం కలెక్టర్ ఆనంద్‌కు నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కాంతిజాన్‌వెస్లీ, వాసు, తదితరులు పాల్గొన్నారు.

'పెత్తందారుల నుంచి దళితులను కాపాడండి'

రాప్తాడురూరల్: జిల్లాలో చాలాచోట్ల దళితుల భూములను పెత్తందారులు చేతుల్లోకి తీసుకుని తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారని వారిబారి నుంచి దళితులను కాపాడాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లాలో నిరుపేదలైన ఎస్సీ,ఎస్టీల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కేపీ నారాయణస్వామి, చిన్న పెద్దన్న, రాయలసీమ జిల్లాల అధ్యక్షులు రమణ, సత్యమయ్య, కుంటిమద్ది ఓబులేసు, గుంతకల్లు మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మానవతావాది గురజాడ

- జేవీవీ గౌరవాధ్యక్షులు రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: కులం లేదు మతం లేదు మానవులంతా ఒక్కటే అన్నదమ్ముల వలె కలిసి మెలిసి జీవించాలని చెప్పి మానవత్వాన్ని చాటుకున్న గొప్ప మానవతావాది గురజాడ అప్పారావు అని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షులు రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. జన విజ్ఞాన వేదిక, అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం కేఎస్ఎన్ మహిళా డిగ్రీ కళాశాలలో సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన రాచపాలెం మాట్లాడుతూ కన్యాశుల్కం, పుత్తడి బొమ్మ వంటి నాటక రచనలతో నాటి సమాజంలో మహిళలపై జరుగుతున్న దురాచారాలను రూపుమాపడం కోసం గురజాడ అప్పారావు కృషి చేశారన్నారు. జిల్లా గౌరవాధ్యక్షులు డాక్టర్ పి.ప్రసూన మాట్లాడుతూ గురజాడ అప్పారావు ఆలోచనలతో తన కాలాని కంటే వందేళ్లు ముందున్నారన్నారు. రచనలతో ప్రజలను చైతన్య పరచడానికి కృషి చేశారన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీ రంగయ్య, తెలుగు అధ్యాపకులు రామకృష్ణ, జేవీవీ జిల్లా నాయకులు మహమ్మద్ జిలాని, గాంగే నాయక్, శ్రీనివాసరావు, నాగరత్న, నగర అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్ రెడ్డి, తిరుపాలు, నాయకులు రామిరెడ్డి, శాంతరాజు, ఐద్వా నాయకురాలు అశ్విని పాల్గొన్నారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
23-9-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
466	125
82,160	25,202

విదేశీ సూచీలు

నాస్డాక్	22,775	△	143
డోజోన్స్	46,419	△	103
ఎఫ్టీఎస్ఈ 100	9,232	△	16
డాక్స్	23,533	▽	106
షాంఘై	3,829	△	8
నికాయ్	45,494	△	448

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్


ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్బీఐ	87.80	88.82
£	బ్రిటన్ పౌండ్	ఎస్బీఐ	118.23	121.22
€	యూరో	ఎస్బీఐ	102.23	105.02
¥	జపాన్ యెన్ (100)	ఎస్బీఐ	59.28	60.80
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్బీఐ	57.29	59.57
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.27	69.97
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.60	24.10
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.09	24.35
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.50	13.32

పండుగల ముందు పసిడి పరుగు

- ఒకే రోజు రూ.2,200 పెరుగుదల
- ఢిల్లీలో కొత్త గరిష్ఠం 1,16,200

న్యూఢిల్లీ: పండుగల ముందు పసిడి ధరలు పరుగులు పెడుతున్నాయి. సోమవారం ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత పసిడి 10 గ్రాములకు ఏకంగా రూ.2,200 పెరిగి మరో కొత్త జీవితకాల గరిష్ట స్థాయి రూ.1,16,200కి చేరుకుంది. వెండి సైతం రూ.4,380 ర్యాలీ చేసి కిలోకి రూ.1,36,380 స్థాయిని (కొత్త ఆల్‌టైమ్ గరిష్ఠం) తాకింది.



'అంతర్జాతీయ మార్కెట్లలో ఉన్న బుల్లిష్ ధోరణికి అనుగుణంగా దేశీయంగానూ బంగారం, వెండి ధరలు రికార్డు స్థాయిల్లో ట్రేడయ్యాయి. యూఎస్ ఫెడరల్ రిజర్వ్ ఈ ఏడాది చివరి నాటికి మరో రెండు రేట్ల కోతలు ఉంటాయంటూ సంకేతం ఇవ్వడం డాలర్, ట్రెజరీ ఈల్డ్స్ బలపడటాన్ని అడ్డుకుంది. ఇది పసిడి, వెండి ధరలకు మద్దతిచ్చింది' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. అంతర్జాతీయంగా చూస్తే బంగారం ధర 50 డాలర్లకు పైగా పెరిగి 3,760 డాలర్ల స్థాయిలో ట్రేడయ్యింది. ఈ ఏడాది ఇప్పటి దాకా దేశీ మార్కెట్లో పసిడి ధరలు 47%, వెండి ధరలు 52% పెరగడం గమనార్హం.

అక్టోబర్ 21న మూరత్ ట్రేడింగ్

ముంబై: దీపావళి సందర్భంగా స్టాక్ ఎక్స్ఛేంజీలు అక్టోబర్ 21న గంట పాటు ప్రత్యేక 'మూరత్ ట్రేడింగ్' నిర్వహించనున్నాయి. మధ్యాహ్నం 1.45 గంటలకు మొదలై 2.45 గంటలకు ట్రేడింగ్ ముగుస్తుందని ఎన్ఎస్ఈ, బీఎస్ఈ తెలిపాయి.



ఈ దీపావళి నుంచి సంవత్ 2082 ఆరంభం కానుంది. ఈ పర్వదినం రోజు ట్రేడింగ్ చేస్తే.. వచ్చే దీపావళి వరకు లాభాలు వరిస్తాయనే నమ్మకంతో చాలా మంది మూరత్ ట్రేడింగ్‌లో పాల్గొనేందుకు ఆసక్తి చూపుతుంటారు. గతేడాది(2024) ప్రత్యేక మూరత్ ట్రేడింగ్ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు నిర్వహించాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
యూఎస్‌కు స్మార్ట్‌ఫోన్ ఎగుమతులు డీలా | మార్కెట్‌కు హెచ్-1బీ ఫీజు పెంపు సెగ..

స్టాక్ మార్కెట్లే ఇప్పుడు దిక్కు

అమెరికా నుంచి ప్రతికూలతలు ఎదురవుతున్నా... విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు అమ్మకాలు కొనసాగిస్తున్నా... భారత మార్కెట్లు అంతకంతకూ పెరుగుతుండటానికి కారణం దేశీ ఇన్వెస్టర్లకు మార్కెట్లపై ఉన్న నమ్మకమేనని, కొన్నేళ్లుగా వారు కళ్లజూస్తున్న లాభాలే వారిని ఇన్వెస్ట్‌మెంట్‌కు ప్రేరేపిస్తున్నాయని ఎడిల్‌వీజ్ ఏఎంసీ ఎండీ- సీఈఓ రాధికా గుప్తా అభిప్రాయపడ్డారు. వినూత్న ఉత్పత్తులతో ఎడిల్‌వీజ్‌ను దేశవ్యాప్తంగా విస్తరించి... దేశంలోని అగ్రశ్రేణి మ్యూచువల్‌ఫండ్ కంపెనీల్లో ఒకటిగా మార్చిన రాధికా గుప్తా... నిరంజన్ అవస్థితో కలిసి 'మ్యాంగో మిలియనీర్' అనే పర్సనల్ ఫైనాన్స్ పుస్తకాన్ని రాశారు. దానికి సంబంధించిన కార్యక్రమంలో పాల్గొంటూ 'సాక్షి' ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. వచ్చే ఐదేళ్లలో ఎంఎఫ్ పరిశ్రమ 200 లక్షల కోట్లకు చేరుతుందంటున్న రాధికాతో 'సాక్షి' ఇంటర్వ్యూ ఇది...

'సాక్షి'తో ఎడిల్‌వీజ్ ఎండీ-సీఈఓ రాధికా గుప్తా

- ప్రత్యామ్నాయ పెట్టుబడి మార్గాలేవీ ఆకర్షణీయంగా లేవు
- అందుకే యువత సహా ఇన్వెస్టర్లంతా ఇటు చూస్తున్నారు
- అంతర్జాతీయ ప్రతికూలతలున్నా పెరుగుతున్నది అందుకే...
- గడిచిన కొన్నేళ్లుగా వచ్చిన లాభాలు మార్కెట్లపై నమ్మకం పెంచాయి
- కొన్ని షేర్లలో బబుల్స్ ఉండొచ్చు.. కానీ పునాదులు బలంగా ఉన్నాయి
- లిస్టింగ్ లాభాల కోసం తాడూబొంగరం లేని అన్‌లిస్టెడ్ కంపెనీల్లో పెట్టొద్దు
- దేశ వృద్ధిలో అన్ని రంగాలూ కీలకం.. అందుకే మ్యూచువల్ ఫండ్లు బెటర్
- తక్కువైనా... స్థిరమైన రాబడులతోనే సంపద సృష్టి సాధ్యం



(సాక్షి, ప్రత్యేక ప్రతినిధి)

అంతర్జాతీయంగా ఇబ్బందులెదురవుతున్నా భారత మార్కెట్లు కొత్త శిఖరాలను చేరుకోవటానికి కారణం?

యువత ఆకాంక్షలు పెరుగుతున్నాయి. మరోవంక ఇన్వెస్ట్‌మెంట్‌కు మరీ ఎక్కువ ప్రత్యామ్నాయాలేవీ లేవు. ఎందుకంటే బ్యాంకు డిపాజిట్లు చేశారనుకుందాం. పన్నులు పోతే మిగిలేది తక్కువే. పెరుగుతున్న జీవన ప్రమాణాలకిది సరిపోదు. అందుకని సహజంగానే జనం ఈక్విటీ మార్కెట్ల వైపు చూస్తున్నారు. నేను ఎంఎఫ్ పరిశ్రమలో అడుగుపెట్టినపుడు 'సిప్' ద్వారా వచ్చే మొత్తం 4 వేల కోట్లుగా ఉండేది. ఇపుడది 28వేల కోట్లకు చేరింది. ఇందులో అత్యధిక భాగం దీర్ఘకాలికం. అదే ఇక్కడ కీలకం. ప్రత్యేకించి గడిచిన రెండేళ్లుగా మార్కెట్లోకి వస్తున్న కొత్త ఇన్వెస్టర్లకు మంచి లాభాలొస్తున్నాయి.

అయితే ఈ ర్యాలీ చల్లారిపోయేది కాదని, బుడగలేవీ లేవని అంటున్నారా?

స్మాల్‌క్యాప్ కంపెనీలు... కొన్ని థీమ్స్..., కొన్ని కంపెనీల రూపంలో ఈ బబుల్స్ ఉండొచ్చు. పాలపై నురుగు ఓ 20 శాతం తప్పదు. ఏ బుల్ ర్యాలీకైనా ఇది వర్తిస్తుంది. దానర్థం మొత్తం మార్కెట్ ఇలానే ఉందని కాదుకదా? పునాదులు గట్టిగా ఉన్నాయన్నదే నా పాయింట్.

మరి ఇలాంటి సమయంలో రిటైల్ ఇన్వెస్టర్లకు మీరేం చెబుతారు?

అన్నిటికన్నా ముఖ్యం... అతిగా ఆశించకపోవటం. నా పుస్తకంలో కూడా అదే చెప్పాను. చాలామంది ఇన్వెస్టర్లు గత సంవత్సరాన్ని బేరీజు వేసుకుంటూ 30-40 శాతం రాబడి వస్తుందనే అంచనాలతో ఉన్నారు. అది సరికాదు. రెండోది... హైబ్రిడ్ ఫండ్లు, మల్టీ అసెట్ ఫండ్లు, ఫ్లెక్సీ క్యాప్ ఫండ్ల వంటి మధ్యస్థ ఆదాయాన్నిచ్చే ఉత్పత్తులను ఎంచుకోండి. ఇవి మరీ సంప్రదాయకంగా కాకుండా... మరీ దూకుడుగా కాకుండా మధ్యస్థంగా ఇన్వెస్ట్‌చేస్తాయి. స్థిరంగా నిలకడైన రాబడులనిస్తాయి. సంపద సృష్టించాలంటే అలానే సాధ్యం.

డిఫెన్స్ థీమ్, ప్రభుత్వ బ్యాంకుల థీమ్ అంటూ రకరకాల స్టోరీలను ఈ మధ్య చూస్తున్నాం. చాలామంది రిటైల్ ఇన్వెస్టర్లు వీటిని నమ్ముతున్నారు కదా?

నిజమే!. రిటైలర్లు ఇలాంటి స్టోరీల వెంటనే పరిగెడతారు. చివరకు దురదృష్టకరంగా ఎగ్జిట్ అవుతారు. నేనైతే ఈ థీమ్‌లను నమ్మను. ఏ ఒక్క రంగం వల్లనో దేశం ముందుకెళ్లదు. హోటల్స్, హాస్పిటల్స్, డేటా సెంటర్స్, క్యాపిటల్ మార్కెట్స్, టెక్నాలజీ.. ఇలాంటి రంగాలన్నీ దేశాభివృద్ధితో ముడిపడి ముందుకెళతాయి.

యువత చాలామంది ఎఫ్ అండ్ ఓ ట్రేడింగ్ చేస్తున్నారు. మీరేమంటారు?

అదో దుర్మార్గం. ఎఫ్ అండ్ ఓ అనేది సంస్థలు రిస్క్‌ను తగ్గించుకోవటానికి ఉపయోగించుకోవాల్సిన సాధనం. అంతేతప్ప అప్పులు తెచ్చి ట్రేడింగ్ చేసే యువత కోసం కాదు. విద్యార్థులు, చిన్నచిన్న వర్కర్లు, డ్రైవర్లు రుణాలు తీసుకుని ట్రేడింగ్ చేస్తున్న వ్యవహారాన్ని నేనూ విన్నా. ఇది గ్యాంబ్లింగ్. ప్రమాదకరం. రిటైల్ ఇన్వెస్టర్లు సిప్, మ్యూచువల్ ఫండ్ల ద్వారా తేలిగ్గా సంపద సృష్టించుకోవచ్చు. గ్యాంబ్లింగ్ అవసరం లేదు.

మార్కెట్లో ఏ ఒక్క రంగమైనా మరీ అతిగా పెరిగినట్లు భావిస్తున్నారా?

అలాగని చెప్పలేం. అయితే కొన్ని అన్‌లిస్టెడ్ కంపెనీలు, ఎస్ఎంఈ ఐపీవోల విషయంలో మాత్రం ఆందోళన ఉంది. లిస్టింగ్‌లోనే లాభాలొస్తాయి కదా అని చాలామంది రిటైల్ ఇన్వెస్టర్లు కంపెనీ పూర్వాపరాలేవీ పట్టించుకోకుండా అన్‌లిస్టెడ్ కంపెనీల్లో పెట్టుబడులు పెడుతున్నారు. పేరు చెప్పలేను కానీ... ఈ మధ్య ఒక ఐపీవోలో దెబ్బతిన్నారు. కొన్ని ఎస్ఎంఈ కంపెనీలూ అంతే. వీటిలో పెద్ద లిక్విడిటీ ఉండదు. పరిస్థితులు అనుకూలించకపోతే ఇరుక్కుపోయే ప్రమాదమే ఎక్కువ. అందుకే నేనెప్పుడూ రిటైల్ ఇన్వెస్టర్లను ఇండెక్స్ ఫండ్లలో గానీ, ఏవైనా ఇతర మ్యూచువల్ ఫండ్లలో గానీ పెట్టుబడి పెట్టమని చెబుతాను.

కానీ కొన్ని కంపెనీలు ఏడాదిలో 50 శాతం... రెండు మూడు రెట్లు పెరగటం చూస్తున్నారు కదా? ఇవి రిటైలర్లను ఆకర్షిస్తాయి కదా?

ఇలా పెరిగిన రెండుమూడు గురించే అంతా చెబుతారు. కానీ కుదేలైన షేర్ల గురించి చెప్పరు. స్టాక్ మార్కెట్లో లాభాలు ఆర్జించిన వారిని తప్ప నష్టపోయిన వారి స్టోరీలు బయటకు రావు. ఇలా ఒక షేర్లో పెట్టి లాభపడ్డ వారు కూడా మిగిలిన షేర్లలో రాబడి గురించి చెప్పరు. ఆ షేర్‌ను ఎంచుకోవటం వెనక వారి శ్రమ, సమయం కూడా ఉంటాయి కదా?

ఏడాదికి 10-12 శాతం రాబడినిచ్చే మ్యూచువల్ ఫండ్లు బోరింగ్‌గా అనిపించవచ్చు. కానీ ఆ రాబడి స్థిరంగా ఉంటుంది. సురక్షితం కూడా.

చిన్న పట్టణాల్లో ఇన్వెస్ట్‌మెంట్ సంస్కృతి పెరుగుతోందా?

చాలా. ఎడిల్‌వీజ్‌ను 5 నగరాల్లో ఆరంభించాం. ఇపుడు 60 పట్టణాల్లో ఉన్నాం. త్వరలో 200 పట్టణాలకు విస్తరిస్తాం. స్థానిక భాషల్లో ఆర్థిక పాఠాల లభ్యత.. వారికి సలహాదారులు, డిస్ట్రిబ్యూటర్లు అందుబాటులో ఉండటమన్నదే ప్రధానం.

పాసివ్ (ఇండెక్స్) ఫండ్లకు ఆదరణ పెరుగుతోంది కదా.. మరి యాక్టివ్ ఫండ్లకు వీటితో పోటీ ఉంటుందా?

అలాంటిదేమీ లేదు. చాలామంది ఇన్వెస్టర్లు రెండింట్లోనూ పెట్టుబడి పెడుతున్నారు. బాగా రాబడులనిచ్చిన యాక్టివ్ ఫండ్లలోకి పెట్టుబడులొస్తాయి. లేదంటే పాసివ్ ఫండ్లలోకి వెళతాయి. రెండూ పెరుగుతున్నాయనేది మనం గమనించాలి.

భారత్ బాండ్ ఫండ్ మాదిరి ఎడిల్‌వీజ్ నుంచి కొత్త ఉత్పత్తులేమైనా వస్తున్నాయా?

అక్టోబర్ 1న మేం దేశంలో మొట్టమొదటి హైబ్రిడ్ స్పెషల్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్‌ను (ఎస్ఐఎఫ్) ఆరంభించబోతున్నాం. సెబీ ఇటీవలే దీనికి అనుమతిచ్చింది. దీన్లో కనీస పెట్టుబడి సైజు రూ.10 లక్షలు. దీన్లో రిస్క్ తక్కువ ఉంటుంది. ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల్ని బ్యాలెన్స్ చేసుకోవటానికి ఈ ఫండ్ ఉపయోగపడుతుంది.

ఇపుడు చాలామంది ఇన్వెస్టర్లు అమెరికా సహా అంతర్జాతీయ మార్కెట్లలో ఇన్వెస్ట్ చేయాలని చూస్తున్నారు. ఎడిల్‌వీజ్ ప్రణాళికలేంటి?

టెక్నాలజీ, చైనా సహా కొన్ని గ్లోబల్ ఫండ్లను మేం నడిపిస్తున్నాం. కాకుంటే వీటికి ఆర్‌బీఐ పరిమితులున్నాయి. వీటిని గిఫ్ట్ సిటీ ద్వారా అధిగమించే ప్రయత్నం చేస్తున్నాం. ఇప్పటికే గిఫ్ట్‌సిటీలో కార్యాలయాన్ని ఆరంభించాం.

ఐదు పదేళ్లలో ఎంఎఫ్ పరిశ్రమ ఎలా ఉండొచ్చు?

2030 నాటికి ఇది 200 లక్షల కోట్లకు చేరుతుందన్నది నా అంచనా. దీన్లో 130-140 లక్షల కోట్లు ఈక్విటీలోనే ఉంటాయి. సిప్ పెట్టుబడులు నెలకు రూ. లక్ష కోట్లను చేరుతాయి. దేశంలో 30-40 శాతం మంది మ్యూచువల్ ఫండ్లలో ఇన్వెస్ట్ చేయటమే వికసిత భారత్‌కు అర్థమన్నది నా భావన.

రిటైలర్లు తరచూ చేసే తప్పులేంటి?

అతిగా ఆశ పడటం, స్నేహితుల్ని కాపీ కొట్టడం, సోషల్ మీడియా టిప్స్ తీసుకోవటం, ఇన్వెస్ట్‌మెంట్ బదులు ట్రేడింగ్ చెయ్యటం, డైవర్సిఫికేషన్ లేకపోవటం ఇలా చాలానే ఉన్నాయి. నా పుస్తకంలో ఒక చాప్టర్ మొత్తం ఇదే రాశాను. ఇక సోషల్ మీడియా విషయానికొస్తే బాధ్యతాయుతంగా వాడితే అదో గొప్ప సాధనం. కాకపోతే ఆర్థిక సలహా అనేది చాలా సీరియస్ వ్యవహారం. తప్పుడు సలహాల్ని నమ్మితే కష్టపడి సంపాదించిన డబ్బు పోతుంది. చాలామంది ఇన్ఫ్లుయెన్సర్లు ఇన్వెస్టర్ల ప్రయోజనాల కోసం కాకుండా లైక్‌ల కోసం సలహాలిస్తుంటారు. తెలియని విషయాన్ని చెప్పొద్దన్నది నా సలహా. అర్హులైన నిపుణుల నుంచే సలహాలు తీసుకోవాలి.

సాక్షి స్పోర్ట్స్



భారత్‌కు రానున్న అథ్లెటిక్స్ దిగ్గజం ఉసేన్ బోల్ట్

అథ్లెటిక్స్ దిగ్గజం ఉసేన్ బోల్ట్ రెండోసారి భారత్‌కు రానున్నాడు. బెంగళూరు ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ), ముంబై సిటీ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్ల మధ్య అక్టోబర్ 1న ముంబైలో జరిగే ఎగ్జిబిషన్ ఫుట్‌బాల్ మ్యాచ్‌లో బోల్ట్ బరిలోకి దిగుతాడు. తొలి అర్ధభాగం బెంగళూరు జట్టుకు, రెండో అర్ధభాగంలో ముంబై జట్టుకు బోల్ట్ ప్రాతినిధ్యం వహిస్తాడు. భారత ఫుట్‌బాలర్లతోపాటు, బాలీవుడ్ ఇతర రంగాల ప్రముఖులు ఈ మ్యాచ్‌లో బోల్ట్‌తో కలిసి సరదాగా ఆడతారు. ప్రముఖ స్పోర్ట్స్ మా తయారీ సంస్థ ప్యూమా ఈ మ్యాచ్‌ను ఏర్పాటు చేస్తోంది. ఈ మ్యాచ్‌కంటే ముందు బోల్ట్ సెప్టెంబర్ 26 నుంచి 28 వరకు ఢిల్లీ, ముంబైలలో పలు ప్రైవేట్ ఈవెంట్లలో పాల్గొంటాడు. 'భారత్‌కు మరోసారి రావడానికి ఉత్సాహంతో ఉన్నాను. క్రీడల పట్ల ఇక్కడి ప్రజలకు ఎంతో మక్కువ ఉంది. భారీ సంఖ్యలో నన్ను అభిమానించే వాళ్లు కూడా ఉన్నారు' అని 2014లో తొలిసారి భారత్‌కు వచ్చిన 39 ఏళ్ల బోల్ట్ వ్యాఖ్యానించాడు. 2017లో అథ్లెటిక్స్‌కు గుడ్‌బై చెప్పిన బోల్ట్ ఒలింపిక్స్‌లో 8 స్వర్ణాలు, ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 11 స్వర్ణాలు, 2 రజతాలు, ఒక కాంస్యం సాధించాడు.

దివ్య దేశ్‌ముఖ్‌కు వైల్డ్ కార్డు

పురుషుల ప్రపంచకప్ టోర్నీ బరిలో భారత మహిళా గ్రాండ్‌మాస్టర్



న్యూఢిల్లీ: భారత మహిళా గ్రాండ్‌మాస్టర్, మహిళల చెస్ ప్రపంచకప్ చాంపియన్ దివ్య దేశ్‌ముఖ్ ఈ ఏడాది మరోసారి పురుషుల ఈవెంట్‌లో పాల్గొనేందుకు సిద్ధమైంది. ఇటీవలే గ్రాండ్ స్విస్ టోర్నీలో పురుష గ్రాండ్‌మాస్టర్లతో పోటీపడ్డ దివ్య... అక్టోబర్ 31 నుంచి నవంబర్ 27 వరకు భారత్‌లోని గోవా వేదికగా జరిగే పురుషుల ప్రపంచకప్ టోర్నీలో బరిలోకి దిగనుంది. వాస్తవానికి దివ్యకు ఈ టోర్నీలో పాల్గొనే అవకాశం లేకపోయినా... చివరి నిమిషంలో ఒక ప్లేయర్ వైదొలగడంతో ఆ స్థానాన్ని దివ్య దేశ్‌ముఖ్‌తో భర్తీ చేశారు. ఈ టోర్నీలో ఆడాలని మహిళల ప్రపంచ నంబర్‌వన్ హు ఇఫాన్ (చైనా), ప్రస్తుత ప్రపంచ చాంపియన్ జు వెన్‌జున్ (చైనా)లకు నిర్వాహకులు ఆహ్వానించారు. అయితే ఈ ఇద్దరు చైనా గ్రాండ్ మాస్టర్లు ప్రపంచకప్‌లో ఆడేందుకు రాలేమని తెలిపారు. నాకౌట్ ఫార్మాట్‌లో జరిగే ప్రపంచకప్‌లో మొత్తం 206 మంది ప్లేయర్లు పోటీపడతారు. టాప్-3లో నిలిచిన వారు వచ్చే ఏడాది జరిగే క్యాండిడేట్స్ టోర్నీకి అర్హత సాధిస్తారు. భారత్ నుంచి ఈ టోర్నీలో 20 మంది ప్లేయర్లు ఆడనున్నారు. ప్రస్తుత ప్రపంచ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్, ఇరిగేశి అర్జున్, ప్రజ్ఞానంద, విదిత్, అరవింద్ చిదంబరం, పెంటేల హరికృష్ణ, నిహాల్ సరీన్, మురళీ కార్తికేయన్, ప్రాణేశ్, ఇనియన్, ఎస్ఎల్ నారాయణన్, దీప్తాయన్ ఘోష్, సూర్యశేఖర గంగూలీ, కార్తీక్ వెంకటరామన్, రాజా రిత్విక్, ఆరోన్యక్ ఘోష్, లలిత్ బాబు, హిమల్ గుసెయిన్, హర్షవర్ధన్, నీలాశ్ సాహా పోటీపడనున్నారు.

ఫుట్‌బాల్‌లోనూ పాక్‌పై భారత్‌దే పైచేయి

కొలంబో: ఆసియా కప్ టి20 క్రికెట్ టోర్నీలో పాకిస్తాన్ జట్టును భారత జట్టు చితక్కొట్టగా... మరోవైపు ఫుట్‌బాల్‌లోనూ పాకిస్తాన్ జట్టుపై భారత్ తమ ఆధిపత్యాన్ని చాటుకుంది. దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (శాఫ్) అండర్-17 టోర్నమెంట్‌లో భాగంగా పాకిస్తాన్‌తో సోమవార జరిగిన గ్రూప్ 'బి' చివరి లీగ్ మ్యాచ్‌లో భారత్ 3-2 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున దలాల్‌మువాన్ గాంగ్టే (31వ నిమిషంలో), గున్లైబా వాంగ్‌ఖెరాక్‌పమ్ (64వ నిమిషంలో), రహాన్ అహ్మద్ (74వ నిమిషంలో) ఒక్కో గోల్ చేశారు. పాకిస్తాన్ జట్టుకు హంజా యాసిర్ (71వ నిమిషంలో), మొహమ్మద్ అబ్దుల్లా (43వ నిమిషంలో) ఒక్కో గోల్ అందించారు. ఈ విజయంతో భారత్ గ్రూప్ 'బి'లో ఆడిన మూడు మ్యాచ్‌ల్లోనూ గెలిచి తొమ్మిది పాయింట్లతో టాపర్‌గా నిలిచింది. ఆరు పాయింట్లతో పాకిస్తాన్ రెండో స్థానాన్ని దక్కించుకుంది. గ్రూప్ 'బి' నుంచి భారత్, పాకిస్తాన్ జట్లు సెమీఫైనల్ చేరుకున్నాయి. గ్రూప్ 'ఎ' నుంచి బంగ్లాదేశ్, నేపాల్ జట్లు సెమీఫైనల్లోకి ప్రవేశించాయి. ఈనెల 25న జరిగే సెమీఫైనల్స్‌లో బంగ్లాదేశ్‌తో పాకిస్తాన్; నేపాల్‌తో భారత్ తలపడతాయి.



'సమఉజ్జీల సమరం' ఏమాత్రం కాదు!

- పాక్‌తో 'వైరం' అనడంలో అర్థం లేదు
- సూర్యకుమార్ యాదవ్ వ్యాఖ్య



దుబాయ్: 'ఇద్దరు కొట్టుకుంటే యుద్ధం...అదే ఒకడు మీద పడిపోతే దండయాత్ర'... తెలుగు సినిమాలో ఒక డైలాగ్ ఇది. భారత టి20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సరిగ్గా ఇదే అర్థం వచ్చేలా పాకిస్తాన్ గురించి చెప్పాడు. భారత్, పాక్ మధ్య మ్యాచ్ అంటే ఇప్పుడు పూర్తిగా ఏకపక్షమని అతను గుర్తు చేశాడు. అసలు ఇరు జట్ల మధ్య ఆటను 'వైరం'తో పోల్చాల్సిన అవసరమే లేదని అతను స్పష్టం చేశాడు. భారత్, పాక్ మధ్య 2018 నుంచి జరిగిన గత 7 వన్డేల్లో భారత్ 6 గెలవగా, 1 మ్యాచ్ వర్షంతో రద్దయింది. ఇరు జట్ల మధ్య మొత్తం 15 టి20 మ్యాచ్‌లు జరగ్గా... భారత్ 11 గెలిచి, 3 మాత్రమే ఓడింది. వరుసగా గత 4 మ్యాచ్‌లలో మనదే పైచేయి. 2022లో ఓటమి తర్వాత రెండు ఫార్మాట్‌లు కలిపి మన జట్టు వరుసగా 7 మ్యాచ్‌లలో విజయం సాధించింది. ఈ నేపథ్యంలో టీమిండియా ఆధిపత్యంపై సూర్య తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. 'భారత్, పాకిస్తాన్ మధ్య మ్యాచ్‌లకు 'వైరం' అనే మాటను ఇకపై వాడవద్దని విజ్ఞప్తి చేస్తున్నా. అసలు ఇరు జట్ల మధ్య వైరం అనాల్సినంతగా పోటీ ఎక్కడ ఉంది. నా అభిప్రాయం ప్రకారం రెండు జట్ల మధ్య 15-20 మ్యాచ్‌లు జరిగి ఇద్దరూ 7-7తో సమంగా ఉండి లేదా 8-7తో కాస్త ఆధిక్యంలో ఉంటే సమ ఉజ్జీల సమరం అని చెప్పవచ్చు. కానీ సరిగ్గా అంకెలు గుర్తు లేవు కానీ ప్రస్తుతం ఇది 13-0 లేదా 10-1గా ఉంది. కాబట్టి ఇకపై ఇది అసలు పోటీనే కాదు' అని సూర్య ఘాటుగా వ్యాఖ్యానించాడు.

దూబే స్పెల్ కీలక మలుపు...

పాక్ ఇన్నింగ్స్ డ్రింక్స్ విరామ సమయంలో ఆట మలుపు తిరిగిందని సూర్యకుమార్ అన్నాడు. సాధారణంగా పవర్‌ప్లే తర్వాత ఆట మారుతుందని, కానీ 10-17 ఓవర్ల మధ్య తాము పాక్‌ను కట్టడి చేయడంలో సఫలమయ్యామని కెప్టెన్ చెప్పాడు. ఈ 8 ఓవర్లలో పాక్ 38 పరుగులు మాత్రమే చేయగలిగింది. 'స్పిన్నర్లు బాగానే బౌలింగ్ చేసినా నా దృష్టిలో శివమ్ దూబే స్పెల్ ఆటను మలుపు తిప్పింది. ఈసారి అతను తనకు లభించిన అవకాశాన్ని సమర్థంగా వాడుకుంటూ పూర్తి కోటా ఓవర్లు బౌలింగ్ చేశాడు. ప్రాక్టీస్ సెషన్లలో దూబే బౌలింగ్‌లో బాగా శ్రమించాడు. కొత్త బంతితో కూడా సాధన చేశాడు. ఈ మ్యాచ్‌లో పక్కా ప్రణాళికతో అతను వచ్చాడు' అని సూర్య చెప్పాడు. మరోవైపు నీరు-నిప్పులాంటి గిల్, అభిషేక్ భాగస్వామ్యంపై కూడా సారథి ప్రశంసలు కురిపించాడు. 'అభిషేక్ బ్యాటింగ్ శైలి అలాగే ఉంటుంది. పవర్‌ప్లే తర్వాత కూడా అతను తగ్గడు. గిల్ ఎలా ఆడతాడో కూడా అందరికీ తెలుసు. ఏ రకంగానైనా అతను పరుగులు రాబట్టగలడు. మైదానం బయట కూడా మంచి స్నేహం ఉంటే ఫలితం ఎలా ఉంటుందో వీరిద్దరు చూపించారు. నీరు-నిప్పులాంటి వీరిద్దరు కలిసి ఆడుతుంటే సమన్వయానికి ఒక కనుసైగ చాలు' అని కెప్టెన్ వ్యాఖ్యానించాడు.

'వాళ్లు అలా చేయడం నచ్చలేదు'



భారత్, పాక్ మ్యాచ్‌లలో సహజంగా కనిపించే కవ్వింపులు, మాటల యుద్ధం ఆదివారం మ్యాచ్‌లో కూడా కనిపించింది. వేర్వేరు సందర్భాల్లో అభిషేక్ శర్మ, శుబ్‌మన్ గిల్‌లకు హారిస్ రవూఫ్, షాహిన్ అఫ్రిదిలతో వివాదం రేగింది. దీనిపై మ్యాచ్ తర్వాత అభిషేక్ స్పష్టతనిచ్చాడు. పాక్ ఆటగాళ్ల ప్రవర్తన వల్లే తాను స్పందించాల్సి వచ్చిందని అతను చెప్పాడు. 'ఎలాంటి కారణం లేకుండా వారు మాపైకి దూసుకొచ్చి కవ్వించే ప్రయత్నం చేశారు. అది నాకు అస్సలు నచ్చలేదు. నేను దూకుడుగా ఆడి చెలరేగడమే దానికి సరైన మందు అని భావించాను' అని అభిషేక్ వెల్లడించాడు. తన బాల్య మిత్రుడు గిల్‌తో కలిసి భారీ భాగస్వామ్యం నెలకొల్పడం, అది జట్టు విజయానికి కారణం కావడం పట్ల అభిషేక్ సంతోషం వ్యక్తం చేశాడు. మరోవైపు హాఫ్ సెంచరీ చేశాక తాను గన్ షూటింగ్ తరహాలో చేసిన సంబరంలో ఎలాంటి తప్పూ లేదని పాక్ బ్యాటర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ అన్నాడు. 'ఆ క్షణంలో వచ్చిన ఆలోచనతోనే నేను గన్ తరహాలో బ్యాట్‌తో అలా చేశాను. నేను సాధారణంగా 50 దాటినప్పుడు ఎలాంటి సంబరాలు చేసుకోను. అప్పటికప్పుడు నాకు అలా చేయాలనిపించింది. జనం దాని గురించి ఎలా ఆలోచిస్తారనేది నాకు అనవసరం. దానిని నేను పట్టించుకోను' అని ఫర్హాన్ స్పష్టం చేశాడు.



చావో రేవో మ్యాచ్

- నేడు పాకిస్తాన్‌తో శ్రీలంక ఢీ
- ఆసియా కప్ టి20 టోర్నీ

అబుదాబి: ఆసియా కప్ సూపర్-4 దశలో తమ తొలి మ్యాచ్‌ల్లో ఓడిన రెండు జట్లు కీలక సమరానికి సన్నద్ధమయ్యాయి. నేడు జరిగే పోరులో పాకిస్తాన్‌తో శ్రీలంక తలపడుతుంది. లీగ్ దశలో అజేయంగా నిలిచిన శ్రీలంక గత పోరులో అనూహ్యంగా బంగ్లాదేశ్ చేతిలో ఓడగా... భారత్ చేతిలో పాకిస్తాన్ చిత్తయింది. ఫైనల్ చేరే అవకాశాలు సజీవంగా ఉండాలంటే ఈ మ్యాచ్‌లో గెలవడం తప్పనిసరి. సూపర్-4లో రెండో పరాజయం ఎదురైతే ముందంజ వేసే అవకాశాలు దాదాపుగా ముగిసిపోతాయి. ఈ నేపథ్యంలో ఎవరు పైచేయి సాధిస్తారనేది ఆసక్తికరం. భారత్ చేతిలో ఓడిన మ్యాచ్‌లో ఆరంభంలో పాక్ బ్యాటింగ్ మెరుగ్గానే కనిపించింది. టాప్-3 బ్యాటర్లు ఫఖర్, ఫర్హాన్, అయూబ్ రాణించారు. అయితే జట్టు మిడిలార్డర్ మరీ పేలవంగా కనిపిస్తోంది. తలత్, నవాజ్, కెప్టెన్ సల్మాన్ ఏమాత్రం ప్రభావం చూపలేకపోతున్నారు. పాక్ బౌలింగ్ కూడా గొప్పగా లేదు. మరోవైపు శ్రీలంక కూడా బ్యాటింగ్ వైఫల్యం వల్లే బంగ్లా చేతిలో ఓటమిపాలైంది. అయితే లీగ్‌లో ఆటగాళ్ల ప్రదర్శనను బట్టి చూస్తే ఆ జట్టు కోలుకునే అవకాశం ఉంది. ప్రధాన బ్యాటర్లు కుశాల్ మెండిస్, కుశాల్ పెరీరా, నిసాంకపై అంచనాలు ఉండగా... బౌలింగ్‌లో చమీరా, హసలంక రాణిస్తున్నారు. ఆల్‌రౌండర్‌గా షనక ప్రభావం చూపించాడు. ఇప్పటి వరకు ఆకట్టుకోని కెప్టెన్ అసలంక ఒక మంచి ఇన్నింగ్స్ ఆడాలని టీమ్ కోరుకుంటోంది.

మళ్లీ 'క్యాబ్' అధ్యక్షుడిగా గంగూలీ | విండీస్‌తో సిరీస్‌కు పంత్ దూరం
మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో